ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
గురువారం 7 మార్చి 2024



దశకంఠుడిపై భవుడి విలాసం



ముక్కంటి శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి జగద్రక్షకుడైన పరమశివుడు రావణ బ్రహ్మ వాహనంపై కొలువుదీరగా, జ్ఞానప్రసూనాంబ మయూర వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.మూషిక వాహనంపై వినాయకస్వామి, చప్పరాలపై శ్రీవళ్లి, దేవసేన సమేత కుమార స్వామి, చండీకేశ్వరుడు, భక్తకన్నప్ప కొలువుదీరి ఊరేగారు.ఉదయం ఆలయ అలంకార మండపంలో వేదపండితులు స్వామి, అమ్మవార్లకు విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యాగశాలలో పూజలు చేసి పురవిహారానికి తీసుకువచ్చారు.వాయులింగేశ్వరుడు హంస వాహనంపై, జ్ఞానప్రసూనాంబ యాళి వాహనంపై అధిరోహించి పురవీధుల్లో ఊరేగారు. కోలాటాలు, బ్యాండు వాయిద్యాల సందడి, శివనామస్మరణలతో చతుర్మాడ వీధులు మార్మోగాయి.

- శ్రీకాళహస్తి

తిరుమలేశుడి సేవలో జూనియర్ శ్రీదేవి

దివంగత సినీనటి శ్రీదేవి కుమార్తె, హీరోయిన్ జాన్వీకపూర్ బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మంగళవారం రాత్రి కాలినడకన తిరుమలకు చేరుకున్న ఆమె బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తన పిన్నమ్మ అయిన నటి మహేశ్వరితో కలిసి ఆలయంలోకి వెళ్లారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. జాన్వీకపూర్‌కు వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు.ఆలయం ముందు జాన్వీకపూర్‌ను చూసేందుకు యాత్రికులు ఉత్సాహం చూపారు.

-తిరుమల, ఆంధ్రజ్యోతి

అవార్డందుకున్న వినుకొండ



ప్రముఖ డోలు విద్వాంసుడు వినుకొండ సుబ్రమణ్యం బుధవారం కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డును అందుకున్నారు.గూడూరు మాళవ్యానగర్‌కు చెందిన ఆయన ఆలిండియా రేడియో టాప్‌గ్రేడ్ ఆర్టిస్టుగా 40 సంవత్సరాలకు పైగా దేశమంతా డోలు కచేరీలు చేశారు. సుబ్రమణ్యం ప్రావీణ్యతను గుర్తించిన కేంద్ర సంగీత నాటక అకాడమీ ఆయన్ను అవార్డుకు ఎంపిక చేసింది.ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా బుధవారం పురస్కారాన్ని స్వీకరించారు.పలువురు కళాకారులు ఆయనకు అభినందనలు తెలిపారు.

- గూడూరు

8 కిలోల గంజాయి పట్టివేత

గూడూరు, మార్చి 6:స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలో గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని పట్టుకుని 8 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ రమేష్ చెప్పారు.గూడూరు ఎస్ఈబీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రానికి చెందిన జయకుమార్, గుణశేఖరన్ బస్టాండు సమీపంలోని వినాయకుడి గుడి వద్ద తచ్చాడుతుండగా తనిఖీ చేశామన్నారు. వారి వద్ద రెండు బ్యాగుల్లో రూ. 40వేల విలువచేసే 8 కేజీల గంజాయి ఉండటాన్ని గుర్తించి, స్వాధీనం చేసుకున్నామన్నారు.అనకాపల్లికి చెందిన అరుణ్ అనే వ్యక్తి నుంచి గంజాయిని కొనుగోలు చేసి చెన్నైకి చెందిన ప్రసాద్‌కు అందజేస్తే వీరికి రూ. 10వేల వంతున ఇస్తామని చెప్పడంతో గంజాయిని తరలిస్తుండగా పట్టుకోవడం జరిగిందన్నారు.ఎస్ఐలు బ్రహ్మనాయుడు, మోసెస్ తదితరులు పాల్గొన్నారన్నారు.

మంత్రి సమావేశానికి హాజరు కాకుంటే చర్యలు!

మహిళా టీచర్లకు పుత్తూరు డీవైఈవో హెచ్చరిక

పుత్తూరు అర్బన్, మార్చి 6: మహిళా దినోత్సవం పేరుతో మంత్రి రోజా నిర్వహించతలపెట్టిన సమావేశానికి మహిళా టీచర్లు హాజరు కాకుంటే చర్యలు తప్పవని హెచ్చరిస్తూ పుత్తూరు డీవైఈవో హెచ్చరిక జారీ చేశారు. ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం వున్న నేపథ్యంలో మంత్రి రోజా ఒక రోజు ముందుగానే 7వ తేదీన సాయంత్రం 4 గంటలకు పుత్తూరు ఎన్జీవో కాలనీ సమీపంలోని షాదీ మహల్‌లో సమావేశం జరపాలని నిర్ణయించారు. ఎన్నికల నేపథ్యంలో రోజూ ఏదో ఒక వర్గంతో సమావేశమై మద్దతు కోరుతున్న మంత్రి రోజా ఈ సమావేశానికి మహిళా టీచర్లను రప్పించాలని ఆదేశించారో లేదో తెలియదు గానీ పుత్తూరు డీవైఈవో మాత్రం ఎంఈవో 1, ఎంఈవో 2లతో పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు వాట్సప్ మెసేజీలు పంపించారు. మంత్రి నిర్వహిస్తున్న సమావేశానికి మహిళా టీచర్లు తప్పనిసరిగా హాజరు కావాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని అందులో స్పష్టం చేశారు.మహిళా దినోత్సవం ముందు రోజే నిర్వహిస్తుండడం ఒక టైతే, సాయంత్రం 4 గంటలకు సమావేశానికి రావాలంటే స్కూళ్ల నుంచీ టీచర్లు పని వేళలు ముగియక ముందే బయల్దేరాల్సి వుంటుంది. నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్న ఈ పనులకు మళ్లీ బెదరింపులేమిటని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు.మంగళవారం పుత్తూరులో అంగన్వాడీ కార్యకర్తలతో ఇదే విధంగా మహిళా దినోత్సవం నిర్వహించారు. దీనికి కూడా మంత్రి రోజా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశానికి కూడా ఖచ్చితంగా రావాలని అంగన్వాడీలపై ఒత్తిడి తీసుకురావడం వివాదాస్పదమైంది.అధికార పార్టీ నేతలకు సంబంధించిన కార్యక్రమాలన్నింటికీ బెదిరింపులు, హెచ్చరికలతో ఆయా వర్గాలను హాజరు చేయించడానికి అధికారులు యత్నిస్తున్న తీరు విమర్శలకు దారి తీస్తోంది.

మిచౌంగ్ తుఫాన్ పరిహారం విడుదల

తిరుపతి(కలెక్టరేట్),మార్చి 6:మిచౌంగ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం వారి ఖాతాల్లో జమ చేసినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. బుధవారం ఉదయం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది డిసెంబరులో సంభవించిన మిచౌంగ్ తుఫాను కారణంగా వ్యవసాయ పంటలకు సంబంధించి నష్టపోయిన 5,650 మంది రైతులకు రూ.5,00,935కోట్లు, ఉద్యాన పంటలకు సంబంధించి 1,346మంది రైతులకు రూ.89.85లక్షల పంట నష్ట పరిహారాన్ని జమ చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్, జిల్లా ఉద్యానశాఖాధికారి దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

కాల్వవంకలో కబ్జాపర్వం

పోటాపోటీగా అక్రమ నిర్మాణాలు

రేణిగుంట, మార్చి 6 : రేణిగుంట పంచాయతీ పరిధిలోని వివేకానంద కాలనీ పక్కన వున్న కాల్వ వంక, పోరంబోకు దాని పక్కన ఉన్న ప్రభుత్వ భూముల్లో వైసీపీ నాయకులు నిర్మాణాలు చేపడుతున్నారు.వివేకానంద కాలనీ పక్కన వున్న వంక పోరంబోకులో సర్వే నెంబరు 831లో 14.28ఎకరాల పోరంబోకు భూమిఉంది. పట్టణానికి చెందిన వైసీపీ నాయకురాలు అక్రమ నిర్మాణాలు చేపట్టి విక్రయించేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు.రెవెన్యూ అధికారులు గతంలో రెండుసార్లు నిర్మాణాలను అడ్డుకున్నప్పటికీ నిర్మాణాలు కొనసాగుతున్నాయి.ఈ విషయంపై స్థానిక కమ్యూనిస్టు పార్టీ నేతలు తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఏమైందో కానీ మరుసటి రోజు మరో పక్క ప్రభుత్వ భూమిని కబ్జాచేసి వాళ్లు నిర్మాణాలు మొదలుపెట్టారు. వైసీపీ నాయకుల కబ్జాలను తొలగిస్తే తాము తొలగిస్తామంటున్నారు.ఈ అక్రమ నిర్మాణాలతో కాల్వ పరిమాణం తగ్గిపోయింది.భారీ వర్షాలు పడితే కాలువలో నీరు ముందుకు పోయే పరిస్థితి లేకపోవడంతో సమీపంలో ఉన్న ఇళ్లపైకి వస్తాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



వైసీపీ నాయకురాలు నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలు



పోటాపోటీగా కమ్యూనిస్టులు నిర్మిస్తున్న నిర్మాణాలు

రుయాలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు

● ప్రారంభించిన ఆస్పత్రి వైద్యాధికారులు



తిరుపతి సిటీ, మార్చి 6 : తిరుపతి రుయా ఆస్పత్రిలో పేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఎస్వీ వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ జి.రవిప్రభు బుధవారం వైద్య సేవలను ప్రారంభించారు. చంద్రశేఖరన్ మాట్లాడుతూ పేద రోగులకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలన్న ఉద్దేశంతో మొదటి విడతగా ఐదు విభాగాల్లో ఈ సేవలను అందిస్తున్నామన్నారు. సోమ, బుధ, శుక్ర, శనివారాల్లో ఈ వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. 50 పడకలు అందుబాటులో ఉన్నాయని, ఇందుకుగాను గత నెలలో 10 మంది సూపర్ స్పెషాలిటీ వైద్యులను నియమించామని చెప్పారు. కార్డియో తురాసిక్ మస్క్యులర్ సర్జన్ డాక్టర్ కళ్యాణి, మెడికల్ ఆంకాలజీ డాక్టర్ రవిశంకర్, సర్జికల్ ఆంకాలజీ డాక్టర్ సి.అఖిలేష్, రేడియో ఆంకాలజీ డాక్టర్ చండీప్రియ, రేడియేషన్ సేఫ్టీ ఆఫీసర్ వీసీ సాహిత్య, నెఫ్రాలజీ డాక్టర్ సునీత, డాక్టర్ ఎస్. పావని, ఏఆర్ఎంవో డాక్టర్ హరికృష్ణ, రుయా ఆస్పత్రి అడ్మిన్ డాక్టర్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీ ఓపీ వివరాలు..

- బుధ, శనివారాలు: కార్డియో తురాసిక్ వేస్క్యులర్ సర్జరీకి ఓపీ ఉంటుంది
- సోమ, గురువారం: నెఫ్రాలజీ విభాగం ఓపీ
- బుధ, శుక్రవారం: మెడికల్ ఆంకాలజీ ఓపీ
- సోమ, బుధ, శుక్రవారాలు: సర్జికల్ ఆంకాలజీ, రేడియో థెరపీ విభాగాల్లో ఓపీ సేవలు అందుబాటులో ఉంటాయి.

చిత్తూరుకు ఏమీ చేయలేకపోయా

- హామీలే తప్ప సహకరించని సీఎం
- ఎమ్మెల్యే, రాజ్యసభ టికెట్ ఇస్తానని మోసం
- వైసీపీకి రాజీనామా చేసిన ఆరణి
- నేడు పవన్ సమక్షంలో జనసేనలో చేరిక

చిత్తూరు సిటీ, మార్చి 6: 'చిత్తూరు నియోజకవర్గంలోని సమస్యలు, చేయాల్సిన అభివృద్ధి గురించి పలుమార్లు సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లా. ప్రతిసారి హామీలు ఇచ్చారే తప్ప, ఒక్క పనికీ సహకరించలేదు. ఈ ఐదేళ్లు చిత్తూరుకు ఏమీ చేయలేకపోయా' అని వైసీపీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆవేదన వ్యక్తంచేశారు. చిత్తూరులోని తన నివాసంలో బుధవారం మీడియా సమావేశం నిర్వహించిన ఆయన.. వైసీపీ ప్రభుత్వ తీరు, తనకు జరిగిన అవమానాల గురించి వివరించారు. వైసీపీకి రాజీనామా చేసిన ఆయన, గురువారం జనసేనలో చేరుతున్నట్లు ప్రకటించారు. నియోజకవర్గంలో రోడ్ల గుంతలు పూడ్చడానికి కూడా నిధులు ఇవ్వలేదన్నారు. గత ప్రభుత్వంలో వేసిన రోడ్లు పూర్తిచేయడానికి రూ.20 కోట్లు అవసరమని అడిగినా రూపాయి కూడా మంజూరు చేయలేదన్నారు. 'ఐదేళ్లుగా నన్ను ఆదరించిన చిత్తూరు నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు. సీఎం జగన్, వైసీపీ అధిష్ఠానం సూచించిన అన్ని కార్యక్రమాలను నేను చిత్తశుద్ధితో నిర్వహించా. చాలావాటిలో రాష్ట్రంలోనే నెంబర్ వన్ ఎమ్మెల్యేగా స్థానం సంపాదించుకున్నా. చిత్తూరు టికెట్ మళ్లీ నాకు ఇస్తానని రెండేళ్ల కిందట సీఎం జగన్ హామీ ఇచ్చారు. వైసీపీ బస్సుయాత్ర సభలోనూ నన్నే ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించారు. గత నెలలో సీఎంను కలిసినప్పుడు ఎమ్మెల్యే టికెట్ కాకుండా రాజ్యసభ ఇస్తానని, తర్వాత ఏపీఐఐసీ చైర్మన్ పదవి ఇస్తానని హామీ ఇచ్చారు. తీరా అదికూడా లేకుండా మోసం చేశారు. ఇన్నాళ్లూ ప్రభుత్వ భాగస్వామ్యంలో ఉన్నా కాబట్టి ప్రశ్నించలేకపోయా. సీఎం వ్యవహార శైలితో వైసీపీ ఎమ్మెల్యేలు చాలా అసంతృప్తితో ఉన్నారు. పార్టీలో అనేక అవమానాలు భరించాను. ఇక ఉండలేక బయటికి రావాల్సి వచ్చింది. చిరంజీవి కుటుంబంతో నాకు చాలా సన్నిహిత సంబంధాలున్నాయి. ఆ దిశగానే జనసేన పార్టీలో గురువారం చేరబోతున్నా' అని ఆరణి చెప్పారు. చిత్తూరులో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి గురజాల జగన్ మోహన్ గెలుపు కోసం కృషి చేస్తానని చెప్పారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తారా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు తనను ప్రజలు గెలిపించారని ఎమ్మెల్యేగా కొనసాగుతానని చెప్పారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి అసెంబ్లీ సీటు జనసేనకే!

- చంద్రబాబు, పవన్ భేటీలో నిర్ణయం
- ఆరణి శ్రీనివాసులు, గంటా నరహరి తదితరుల పేర్లతో సర్వే
- నరసింహ యాదవ్, సుగుణమ్మలకు టీడీపీ అధిష్ఠానం నుంచీ పిలుపు

తిరుపతి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గత రెండు నెలలుగా మిత్రపక్షాలైన టీడీపీ, జనసేన పార్టీల శ్రేణుల్ని తికమకపెడుతూ వచ్చిన తిరుపతి అసెంబ్లీ సీటు కేటాయింపు విషయంలో స్పష్టత వచ్చింది. ఈ స్థానాన్ని మిత్రపక్షమైన జనసేనకు కేటాయించింది తెలుగుదేశం పార్టీ. ఇరు పార్టీల అధినేతలూ బుధవారం జరిపిన భేటీలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. నిజానికి టీడీపీ, జనసేన పార్టీలు పొత్తు కుదుర్చుకున్నప్పటి నుంచీ తిరుపతి అసెంబ్లీ సీటు జనసేన పార్టీకే కేటాయిస్తారన్న అంచనాలు మొదలయ్యాయి.అయితే అర్థబలం, అంగబలం, అధికార బలాలతో పాతుకుపోయిన ప్రత్యర్థి పార్టీ నేతలను ఎదుర్కొనేందుకు అవసరమైన వనరుల్లో జనసేన నాయకులు వెనుకబడ్డారు. ఆ కారణంగా ఓ దశలో జనసేన తరపున ఉమ్మడి అభ్యర్థి బరిలో వుండరన్న ప్రచారం ప్రారంభమైంది. అయితే చివరికి బుధవారం ఇరు పార్టీల అధినేతలూ జరిపిన సమావేశంలో తిరుపతి సీటును పొత్తులో భాగంగా జనసేనకు ఖరారు చేశారు. అధికార పార్టీ అభ్యర్థిని దీటుగా ఎదుర్కొనేందుకు తగిన వనరులున్న అభ్యర్థిని ఎంపిక చేసే దిశగా జనసేన, టీడీపీ అధినేతలు అన్వేషణ మొదలుపెట్టినట్టు సమాచారం. అందులో భాగంగా దివంగత డీకే ఆదికేశవులుతో బంధుత్వం, పుష్కలంగా అర్థబలం కలిగిన గంటా నరహరి పేరు ప్రధానంగా పరిశీలనలోకి వచ్చినట్టు తెలిసింది. అదే సమయంలో ఇటీవలే జనసేనాని పవన్ కళ్యాణ్‌ను కలసిన చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేరు కూడా పరిగణనలోకి తీసుకున్నట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. వీరిద్దరితో పాటు తిరుపతి జనసేన నాయకులు పసుపులేటి హరిప్రసాద్, కిరణ్ రాయల్ తదితరుల పేర్లు కూడా కలుపుకుని గురువారం నుంచీ ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహించనున్నట్టు సమాచారం.

స్థానికులకే టికెట్ ఇవ్వాలని బలిజల డిమాండ్

తిరుపతి సీటు జనసేనకు ఖరారైన నేపథ్యంలో ఎట్టి పరిస్థితుల్లోనూ టికెట్ స్థానికులకే ఇవ్వాలన్న డిమాండ్ మొదలైంది. నియోజకవర్గంలో ప్రాబల్యం కలిగిన బలిజ సామాజికవర్గంలో పలువురు తిరుపతి టికెట్ స్థానికేతరులకు ఇవ్వరాదని కోరుతున్నారు. గురువారం లేదా శుక్రవారం ఆ సామాజికవర్గానికి చెందిన ముఖ్యులతో సమావేశం నిర్వహించి స్థానికులకే టికెట్ ఇచ్చేలా తీర్మానం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ పరిణామాలు ఎక్కడికి దారి తీస్తాయో వేచి చూడాల్సివుంది.ఈ నేపథ్యంలో తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మలకు అధిష్ఠానం నుంచీ పిలుపు వచ్చింది. గురువారం ఉదయం 11 గంటలకు మంగళగిరిలోని పార్టీ కార్యాలయం చేరుకోవాలని బుధవారం సాయంత్రం వారిద్దరికీ పిలుపు వచ్చింది. దీంతో నరసింహయాదవ్ బుధవారం రాత్రే బయల్దేరి వెళ్లగా సుగుణమ్మ గురువారం ఉదయం వెళుతున్నట్టు సమాచారం. అక్కడ వారు తొలుత టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడితో సమావేశం కానున్నారు. తిరుపతి టికెట్ జనసేనకు కేటాయించిన నేపథ్యంలో వారికి అధిష్ఠానం నిర్ణయం గురించి వివరించేందుకు, జనసేన అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని కోరేందుకు పిలిపించినట్టు తెలుస్తోంది. వీరిద్దరూ టికెట్ రేసులో నిలిచిన ప్రధాన ఆశావహులు కావడాన అధిష్ఠానం నిర్ణయం పట్ల వీరి అభిప్రాయం ఎలా వుంటుందో కూడా చూడాల్సి వుంది. అదే సమయంలో ఊకా విజయ్‌కుమార్ పేరు కూడా టీడీపీ టికెట్ రేసులో ప్రముఖంగా వినిపించిన సంగతి తెలిసిందే. ఆయన ఎలా స్పందిస్తారో తెలియడం లేదు. ప్రజారాజ్యం పార్టీలో గతంలో క్రియాశీలకంగా వ్యవహరించిన ఆయనకు చిరంజీవి, పవన్ కళ్యాణ్‌లతో సన్నిహిత సంబంధాలున్న నేపథ్యంలో ఆయన పేరు కూడా జనసేన అధినేత పరిగణనలోకి తీసుకునే అవకాశం కనిపిస్తోంది.




సూర్యప్రభ వాహనంపై కల్యాణ వెంకన్న - చంద్రప్రభ వాహనంపై దర్బార్ కృష్ణుడి అలంకరణలో కల్యాణ వెంకన్న

సూర్య, చంద్రప్రభలపై
కల్యాణ వెంకన్న చిద్విలాసం

చంద్రగిరి, మార్చి 6: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి బుధవారం సూర్య, చంద్రప్రభ వాహనాలపై భక్తులను అనుగ్రహించారు. ఉదయం ధన్వంతరి శ్రీనివాసుడు అలంకరణలో కల్యాణ వెంకన్న సూర్యప్రభ వాహనంపై తిరుమాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చాడు. రాత్రి స్వామివారి ఉత్సవమూర్తిని వాహన మండపానికి తీసుకొచ్చి దర్బార్ కృష్ణుడిగా అలంకరించి చంద్రప్రభ వాహనంపై మేళతాళాలు, మంగళవాయిద్యాలు, చెక్క భజనలు, కోలాటాలు, కేరళా వాయిద్యాలు, గోవింద నామ స్మరణల ఊరేగించారు.ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, కంకణ భట్టర్ శేషాచార్యులు,ఏఈవో గోపీనాథ్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, పార్థసారథి, నారాయణాచార్యులు, సూపరింటెండెంట్లు మునిచెంగల్రాయులు, వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు. గురువారం ఉదయం రథోత్సవాన్ని నిర్వహించనున్నారు.

ముక్కోటిలో వైభవంగా రథోత్సవం



చంద్రగిరి, మార్చి 6: తొండవాడ స్వర్ణముఖినది ఒడ్డున వెలసిన అగస్త్యేశ్వరాలయంలో బుధవారం ఉదయం రథోత్సవాన్ని నిర్వహించారు. రాత్రి కామధేను వాహనంపై పార్వతీపరమేశ్వరులు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 7.30 గంటలకు ఉత్సవర్లను రథంలో ఆలయ ప్రదక్షిణగా ఊరేగించారు. రాత్రి 7 గంటలకు స్వామిఅమ్మవార్ల ఉత్సవర్లను కామధేను వాహనంపై ఊరేగించారు. ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుతోనే యువతకు ఉపాధి

చంద్రగిరి, మార్చి 6: చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటుతోనే యువతకు, మహిళలకు ఉపాధి అవకాశాలు అందుతాయని టీడీపీ యువనేత పులివర్తి వినీల్ అన్నారు.బుధవారం చంద్రగిరి మండలం పనపాకం పంచాయతీలో బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పులివర్తి వినీల్ ఇంటింటికి వెళ్ళి టీడీపీ మినీ మేనిఫెస్టో పథకాలను వివరించారు.టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, నాయకులు మేడసాని కుమార్, నగరం రమేష్, జేడీ ప్రసాద్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా తలకోనలో రుద్ర హోమం



ఎర్రావారిపాలెం, మార్చి6: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా తలకోన సిద్ధేశ్వర స్వామి దేవాలయంలో రెండవ రోజు బుధవారం రుత్విక్ పండితులు శాస్త్రోక్తంగా రుద్ర హోమం నిర్వహించారు.ఉదయం మహాగణపతి పూజ, సహస్ర కుంకుమార్చన, మహాగణపతి హోమం, నవగ్రహ హోమం, మృత్యుంజయ హోమం, పూర్ణాహుతి, సాయంత్ర వేద పారాయణం, సిద్ధేశ్వరిదేవి సహస్ర కుంకుమార్చన నిర్వహించారు.ఆలయ పాలనాధికారి జయకుమార్,చైర్మన్ వేణుగోపాల రెడ్డి , ట్రస్ట్ సభ్యులు నాగిరెడ్డి, జయంత్, తరిగొండ మంజుల, సురేష్, మధుసూదన శెట్టి, రాజేశ్వరి, గంగోజీ, గీత తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన ప్రచారం

పాకాల, మార్చి6: పాకాల పంచాయతీ కరీంతుల్లాబాద్‌లో బుధవారం హర్ ముస్లిం జనసేన టీడీపీకే సాత్ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ, జనసేన నాయకులు ఇంటింటికీ తిరిగి తెలుగుదేశం అమలు చేయనున్న సంక్షేమ పథకాలు వివరిస్తూ ఎమ్మెల్యేగా పులివర్తి నానీని గెలిపించాలని అభ్యర్థించారు.టీడీపీ నాయకులు టీజే ప్రవీణ్, కనకరాజు, జియాఉద్దీన్, బాబుసాహెబ్, లతీఫ్, జనసేన నాయకులు నాసీర్, దినేష్, రహమతుల్లా, షాజహాన్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

రవణయ్యగారిపల్లెలో వైసీపీ ప్రచారం

పాకాల,మార్చి6: మండలంలోని రవణయ్యగారిపల్లెలో సోమవారం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి లక్ష్మి ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

కన్సోలేషన్ అధికారుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి (రవాణా), మార్చి 6: విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖలో పలు ట్రిబ్యునల్స్‌కు వచ్చే దావాలను పరిష్కరించడానికి అర్హత కలిగిన సామాజిక కార్యకర్తల నుంచి కన్సోలేషన్ అధికారిగా వ్యవహరించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తిరుపతి శాఖ ఏడీ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వయస్సు 60 సంవత్సరాలు పైబడి, ఏదైనా సంస్థలో ముఖ్య సభ్యుడై ఉండి, సామాజిక కార్యకర్తగా ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. న్యాయశాస్త్రంలో అవగాహన ఉండాలని తెలిపారు. ఎలాంటి గౌరవ వేతనం, జీతభత్యములు ఆశించకుండా స్వచ్ఛంద సేవ అందించాలని వివరించారు. అర్హత కలిగినవారు ఈనెల 21వ తేదీలోపు తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డులోని రాష్ట్రీయ సేవా సమితి కార్యాలయంలో దరఖాస్తులను అందించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 8500382542ను సంప్రదించాలని పేర్కొన్నారు.

గుర్తుపట్టారా..?



గుండు కొట్టించుకుని మెడలో వస్త్రం, చేతిలో శ్రీవారి ప్రసాదంతో ఉన్న ఈ వ్యక్తిని గుర్తుపట్టారా.ఇటీవల విడుదలైన యానిమల్ సినిమాతో దేశవ్యాప్తంగా పాపులరైన డైరెక్టర్ సందీప్‌రెడ్డి వంగా.తొలినుంచీ పొడవాటి జుట్టు, గడ్డంతో కనిపించిన సందీప్‌రెడ్డి వంగా బుధవారం తిరుమలలో తలనీలాలు సమర్పించి శ్రీవారిని దర్శించుకుని ఆలయం ముందు ఇలా గుండులో కనిపించారు. పలువురు సినీ అభిమానులు ఆయన్ను గుర్తించి సెల్ఫీలు తీసుకున్నారు. సందీప్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. శ్రీవారి దర్శనార్థం తరచూ తిరుమలకు వస్తుంటానన్నారు. త్వరలో ప్రభాస్‌తో 'స్పిరిట్' సినిమా మొదలవుతుందని తెలిపారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

చిత్తూరు ఎంపీ టీడీపీ అభ్యర్థిగా ప్రసాదరావు?

చిత్తూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నుంచి చిత్తూరు ఎంపీ అభ్యర్థిగా విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి దగ్గుమళ్ల ప్రసాదరావును దాదాపుగా ఖరారు చేసినట్లు తెలుస్తోంది. సివిల్స్ సర్వీసెస్‌లో ఐఆర్ఎస్ అధికారిగా ఎంపికై, ఇన్‌కమ్‌ట్యాక్స్ విభాగంలో జాయింట్ కమిషనరుగా పనిచేసిన ప్రసాదరావు 2019లో ముందస్తు పదవీ విరమణ తీసుకున్నారు. బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గానికి చెందిన ఈయన హైదరాబాద్ పరిసరాల్లో నిర్మాణ రంగ వ్యాపారంలో ఉన్నారు. బాపట్ల ఎంపీ సీటుకోసం ప్రయత్నించిన ఈయనను చిత్తూరుకు చంద్రబాబు ఎంపిక చేశారని తెలుస్తోంది.గత ఎన్నికల అనుభవంతో ఈసారి ఎట్టిపరిస్థితుల్లోనూ చిత్తూరు ఎంపీ స్థానాన్ని గెలిచి తీరాలనే పట్టుదలతో టీడీపీ ఉంది. గతంలో కుప్పం, పలమనేరుల్లోని ఆధిక్యతతోనే చిత్తూరు ఎంపీ స్థానాన్ని టీడీపీ సులువుగా గెలుచుకునేది. ప్రస్తుతం చిత్తూరు పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ ఆ పార్టీ బలంగా ఉంది.గట్టిగా గెలిచే సీటు కావడంతో పలువురు ఆశించారు.జీడీనెల్లూరు నియోజకవర్గానికి చెందిన, పలువురు ప్రధాన మంత్రుల వద్ద చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా పనిచేసిన విశ్రాంత ఎస్పీ మునస్వామి, సినీ నటుడు సప్తగిరి, వేపంజేరి మాజీ ఎమ్మెల్యే ఆర్.గాంధీ ఇక్కడి నుంచి పోటీచేయడానికి ఉత్సాహం చూపారు. అందుకు ప్రయత్నాలు కూడా చేశారు. అయితే ఆర్థికంగా బలంగా ఉండి, మంచి చరిత్ర గల వ్యక్తిని ఎంపిక చేశారని అంటున్నారు.

మఠం భూముల్లో ఇళ్ల తొలగింపు

- టీడీపీ, జనసేన, ఓబీసీ ఫోరం నిరసన
- వైసీపీకి సాహిత్య అకాడమీ డైరెక్టర్, ఆమె తనయుడు రాజీనామా



నిరసన తెలుపుతున్న బాధితులు

తిరుపతి రూరల్, మార్చి 6 : తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట గ్రామంలోని హథీరాంజీ మఠం భూముల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను బుధవారం ఉదయం పోలీసుల సాయంతో మఠం అధికారులు తొలగించారు. తాజాగా నిర్మించిన దాదాపు 30ఇళ్లను తెల్లవారుజామున ఎక్స్‌కవేటర్ సాయంతో కూలగొట్టారు. విషయం తెలుసున్న వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డితోపాటు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పులివర్తి నాని, జనసేన నేత మనోహర్, ఓబీసీ ఫోరం రాష్ట్ర కన్వీనర్ బడి సుధాయాదవ్ బాధితులకు అండగా నిలిచారు. గ్రామస్తులతో కలసి ఘటనా స్థలానికి చేరుకున్న మోహిత్ రెడ్డి తొలగింపు పనులను అడ్డుకున్నారు. టీడీపీ నాయకురాలు పులివర్తి సుధారెడ్డి బాధితులకు అండగా నిలవగా పులివర్తి నాని నేతృత్వంలో పలువురు నిరసనదీక్షకు దిగారు.

తుమ్మలగుంట గ్రామ పరిధిలో మఠానికి చెందిన 165.78 ఎకరాల భూమి ఉంది. 7/6,26/3,28,33, 66-95, 97,98,99,100,101 సర్వే నంబర్లలో ఉన్న ఈ భూమిలో ఎప్పట్నుంచో ఆక్రమణలు యథేచ్ఛగా సాగుతున్నాయి. గతంలో నిర్మించిన కొన్ని నిర్మాణాలకు మఠం అధికారులు నోటీసులు జారీ చేసి పది రోజుల క్రితం తొలగించేందుకు ప్రయత్నించగా ఆక్రమణదారులతో రాజకీయ, ప్రజా సంఘాల నేతలు కలసి అడ్డుకోవడంతో వెనుదిరగాల్సివచ్చింది. కొన్ని రోజులుగా మరిన్ని నిర్మాణాలు చేపట్టడంతో బుధవారం తెల్లవారుజామున పోలీసులు, రెవెన్యూ అధికారుల సహాయంతో మఠం అధికారులు దాదాపు 30 ఇళ్లను కూల్చేశారు. మఠం ఫిట్‌పర్సన్ రమేష్ నాయుడు, ఏఈవో శ్రీనివాసులురెడ్డి, ఆర్డీవో నిశాంత్‌రెడ్డి, వెస్ట్ డీఎస్పీ, పోలీసులతో కలసి ఇళ్లను పరిశీలించి, ఎక్సకవేటర్‌తో తొలగించారు. ఇళ్ల తొలగింపునకు నిరసనగా సాహిత్య అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ దొడ్ల గౌరి, ఆమె కుమారుడు దొడ్ల కరుణాకర్‌రెడ్డి మీడియా సమక్షంలో వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

● టీడీపీ, జనసేన నిరసన

తుమ్మలగుంటలో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల ఆధీనంలో ఉన్న మఠం భూమిలోకి వెళ్లేందుకు అడ్డుగా ఉన్న పేదల ఇళ్లను అక్రమంగా తొలగించారని ఆరోపిస్తూ టీడీపీ, జనసేన నాయకులు నిరసనకు దిగారు.టీడీపీ ఇన్‌చార్జి నానీతో పాటు నాయకులు, జనసేన చంద్రగిరి ఇన్‌చార్జి మనోహర్,ఓబీసీ ఫోరం నేత బడి సుధాయాదవ్ తదితరులు టెంట్‌వేసి ఆందోళన చేపట్టారు. నానీ మాట్లాడుతూ ఎమ్మెల్యే తమ్ముడు బినామీ పేరుతో మఠం భూములను కౌలుకు పొడుకుని ప్లాట్లు వేసి విక్రయిస్తున్నాడని, వీటిని కొనుగోలు చేసిన పేదలు ఇళ్లు కట్టుకుంటే కూల్చి వేస్తున్నారని మండిపడ్డారు. పేదలు ఏర్పాటు చేసుకున్న ఇళ్లకు విద్యుత్ మీటర్లు, ఇంటిపన్ను కాగితాలున్నా తొలగిస్తున్నారని వాపోయారు. ఇదే భూముల్లో చెవిరెడ్డి కుటుంబ సభ్యుల పేరిట 20 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేసుకుని ఉన్నారని, వాటి జోలికి ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. ఓబీసీ ఫోరం రాష్ట్ర కన్వీనర్ బడి సుధాయాదవ్ మాట్లాడుతూ సొంత గ్రామంలో ప్రజలకు న్యాయం చేయలేని ఎమ్మెల్యే నియోజకవర్గానికి ఏమి న్యాయం చేస్తారని ప్రశ్నించారు. అనంతరం తిరుపతి గాంధీ రోడ్డులోని మఠం పరిపాలనా కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడతామని పేర్కొన్నారు.

● నేడు అఖిలపక్ష సమావేశం

తుమ్మలగుంట రైతుల భూములకు, ఇళ్లు కోల్పోయిన బాధితులకు అండగా గురువారం ఉదయం 8.30 గంటలకు అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్లు గ్రామ రైతులు, ఇళ్లు కోల్పోయిన బాధితుల పేరిట ఒక ప్రకటన వెలువడింది.



● మఠం భూములను విక్రయిస్తున్న అక్రమార్కులపై క్రిమినల్ కేసులు

తిరుపతి అర్బన్, మార్చి 6: హథీరాంజీ మఠం భూములను విక్రయిస్తున్న అక్రమార్కులపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని మఠం ఫిట్ పర్సన్ రమేష్‌నాయుడు హెచ్చరించారు.బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తుమ్మలగుంటలో ఈ మధ్య కొంతమంది అక్రమ లేఅవుట్లు వేసి మఠం భూములను విక్రయించి ప్రజలను మోసం చేస్తున్నారని సమాచారం అందిందన్నారు.పలుమార్లు హెచ్చరించినా అక్రమ నిర్మాణాలు ఆగలేదన్నారు. ఈ మధ్య కాలంలోనే దాదాపు 200ఇళ్లు నిర్మించడంతో వాటిని నిలువరించాలని పోలీసుల సహాయంతో 40నిర్మాణాలు కూల్చివేశామన్నారు.ఆ సమయంలో ప్రజలను ఎటువంటి ఇబ్బందులకూ గురిచేయలేదన్నారు.

జేసీబీలతో పేదల ఇళ్లు కూల్చుతారా: అచ్చెన్నాయుడు

అమరావతి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): 'అవినీతి, అక్రమార్జనలో సీఎం జగన్‌ను ఆదర్శంగా తీసుకున్న వైసీపీ నేతలు టీడీపీ నేతల్ని గృహ నిర్బంధం చేసి పేదల ఇళ్లు కూల్చారు' అంటూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో మండిపడ్డారు. తుమ్మలగుంటలో హథీరాంజీ మఠం స్థలంలోని పేదల ఇళ్లు కూల్చివేయడాన్ని ఆయన ఖండించారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భూకబ్జారెడ్డిగా మారిపోయారన్నారు. హథీరాంజీ మఠం స్థలంలో 30 ఎకరాలు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆక్రమించారని తెలిపారు. 2.50 ఎకరాల్లో తన భార్య పేరుతో గెస్ట్ హౌస్ నిర్మించుకున్నారని, తన స్థలం పక్కన పేదల స్థలాలు లాక్కునేందుకు చెవిరెడ్డి ఈ దారుణానికి ఒడిగట్టారన్నారు. పేదల ఇళ్లు కూల్చిన అధికారులకు ఆ పక్కనే ఉన్న ఎమ్మెల్యే బంధువుల ఇళ్లు కనపడలేదా అని ప్రశ్నించారు. కూల్చిన ఇళ్లు తిరిగి నిర్మించి ఆ స్థలాలు పేదలకే ఇవ్వాలని అచ్చెన్న డిమాండ్ చేశారు.

ఫ్లైవోవర్‌పై ఢీకొన్న కార్లు : నలుగురికి గాయాలు




తిరుపతి(నేరవిభాగం)మార్చి6 ; నగరంలోని శ్రీనివాసం ఫ్లైవోవర్‌పై బుధవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రెండుకార్లు ఒకదానికొకటి ఢీకొని పల్టీకొట్టాయి. ఇందులో ఒకకారు శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రిజిస్ట్రేషన్ ఉంది. తిరుచానూరులో జరిగిన ఒక పెళ్లికి హాజరై తిరిగి వెళుతుండగా లక్ష్మీపురం సర్కిల్‌లోని ఫ్లైవోవర్ వద్ద మరో కారును ఢీకొట్టారు. నలుగురు గాయపడ్డారు. వారిలో ఇద్దరిని చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. వారు అన్నమయ్య జిల్లా పెనగలూరుకు చెందిన వారుగా గుర్తించారు. కాగా, ఫ్లైవోవర్‌పై నిత్యం ప్రమాదాలు జరగడం చర్చనీయాంశంగా మారింది. ట్రాఫిక్ పోలీసులు దృష్టిసారించకపోవడంతో అతివేగం కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయన్న వాదనలు ఉన్నాయి.

దామినేడుకు అండర్ డ్రైనేజీ కావాలి

- తాగునీరు, మురుగు కలిసిపోయాయి
- రంగుల కోసం రూ.7.5కోట్లు వృథా
- కలెక్టర్ లక్ష్మీశను కలిసిన సుధారెడ్డి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న పులివర్తి సుధారెడ్డి

తిరుచానూరు, మార్చి 6: తిరుపతి రూరల్ మండలం దామినేడు గ్రామానికి అండర్ డ్రైనేజీ సిస్టమ్ కావాలని టీడీపీ నాయకురాలు పులివర్తి సుధారెడ్డి కలెక్టర్ లక్ష్మీశను కోరారు. స్థానికులతో కలెక్టర్‌ను కలిసి ఈ మేరకు ఆమె వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ 2019 ప్రచారానికి వెళ్లినప్పుడు ప్రధానంగా డ్రైనేజీ సమస్య ఉందని చెప్పారని, దాదాపు ఐదు సంవత్సరాలు పూర్తవుతున్నా నేటికీ సమస్య అలాగే ఉందన్నారు. 5 రోజుల క్రితం పులివర్తి నాని ప్రచారంలో భాగంగా దామినేడుకు వెళ్లగా, డ్రైనేజీ వాటర్, తాగునీరు కలిసిపోయినా స్థానికులు వాటినే వాడుకుంటుండడంతో నాని సొంత సొమ్ము రూ.5లక్షలతో స్వయంగా వ్యర్థాలను తొలగించే కార్యక్రమం చేపట్టారని వివరించారు.రూ.లక్షలతో సెప్టిక్ ట్యాంకు ద్వారా వ్యర్థాలను పార్టీ నేతలంతా కలిసి తరలించినా, ఇవన్నీ తాత్కాలికమేనన్నారు. నాలుగు రోజులుగా పనులు చేస్తుంటే బుధవారం ఉదయం పంచాయతీరాజ్ అధికారులు వచ్చి రూ.7.5కోట్లు అంచనా వ్యయంతో టెండర్లు వేసి వర్కు కూడా అనుమతిచ్చామని తెలిపారని, ఇందు కోసం డీఎంఎఫ్ డిపార్ట్‌మెంట్‌కు చెల్లించే కోట్లాది ప్రభుత్వ నిధులను దారి మళ్లిస్తున్నారని ఆరోపించారు. రంగులు వేయడానికి రూ.7.5కోట్లకు అంచనా తెచ్చుకున్నారని విమర్శించారు.రంగులు ముఖ్యం కాదన్న ఆమె అండర్ డ్రైనేజ్ సిస్టమ్ ఏర్పాటుపై దృష్టిపెట్టాలని కలెక్టర్‌ను కోరారు.

ఉచిత మార్చురీ అంబులెన్సు ప్రారంభం



తిరుచానూరు, మార్చి 6: తిరుపతి చుట్టుపక్కల 35 కి.మీ దూరంలో ఉన్నపేదలకు ఉచితంగా మార్చురీ అంబులెన్సును తిరుపతికి చెందిన జనతా సొసైటీ అందుబాటులోకి తెచ్చింది. ఎడిఫై విద్యాసంస్థల చైర్మన్ ప్రణీత్, నారాయణ విద్యాసంస్థల డీజీఎం కొండలరావు, ఎమరాల్డ్ విద్యాసంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ మునిరత్నంరెడ్డి, డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.జయచంద్ర, జనతా సొసైటీ కన్వీనర్ గిరికుమార్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుపతిలోని రుయా, స్విమ్స్‌ప్రసూతి, ప్రైవేటు ఆస్పత్రుల్లో పేదవారు చనిపోతే ఇంటికి కూడా తీసుకెళ్లలేని పరిస్థితిలో ఉన్నారని అలాంటి వారికి ఉచితంగా సేవలు అందిస్తామన్నారు. వివరాలకు 9876541085 ఫోన్ నెంబరును సంప్రదించాలన్నారు.టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు హేమంత్ రాయల్,తేజ, గంగాధర్,రాజేష్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వలసలు

తిరుచానూరు, మార్చి 6: తెలుగుదేశం పార్టీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి పులివర్తినాని సమక్షంలో మండల పార్టీ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, క్లస్టర్‌ఇన్‌చార్జి మధు ఆధ్వర్యంలో పలువురు టీడీపీలో చేరారు. తిరుపతి రూరల్ మండలం పాడిపేట పంచాయతీ, శేషాద్రినగర్‌కు చెందిన 650 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారిలో టి.శ్రీనివాసులు, బి.వెంకటలక్ష్మి, జి.గంగయ్య, ఎం.మునిశేఖర్, కె. జనార్ధన్, పి.శివన్న, బి.పాపజీనాయక్, వి.విజయకుమార్, ఆర్.లక్ష్మి, కె.శ్రావణి, బి.శ్రీనివాసులునాయుడుతో పాటు మరికొందరున్నారు. ఈ ఎన్నికల్లో అన్ని వర్గాలు టీడీపీకి మద్దతు పలకాల్సిన అవసరం వుందని పార్టీలో చేరిన నాయకులు తెలిపారు.



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పులివర్తి నాని



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

ఔషధరంగంలో ఫార్మసిస్టులదే కీలకపాత్ర

రామచంద్రాపురం, మార్చి 6: మండలంలోని వెంకట్రామపురం సమీపంలోని సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాలలో బుధవారం నేషనల్ ఫార్మసీ ఎడ్యుకేషన్ డే, ఫార్మాఅన్వేషన్ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.డాక్టర్ ఎస్ఎల్ఎన్ ప్రసాద్‌రెడ్డి, డాక్టర్ ఎం.వెంకటరమణ, రజితారెడ్డి, బి.కృష్ణారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, సూర్యకుమార్, దేవరాజ్, వెంకటేశ్వర్లు, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో సినీ దర్శకుడు శైలేష్



తిరుచానూరు, మార్చి 6: తిరుచానూరు పద్మావతి అమ్మవారిని సైంధవ్ సినిమా దర్శకుడు శైలేష్ కొలను కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు.

నేటినుంచి శివరాత్రి ఉత్సవాలు



శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన వల్మీకేశ్వరస్వామి ఆలయం

తిరుపతి రూరల్, మార్చి 6: దుర్గసముద్రంలోని శర్వాణి దేవి సమేత వల్మీకేశ్వరస్వామి ఆలయంలో గురువారం నుంచి మూడు రోజుల పాటు మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త ఆదెం శంకరానందరెడ్డి తెలిపారు.గురువారం సాయంత్రం ఆలయంలో ప్రదోష అభిషేకం, శుక్రవారం మహాభిషేకం ప్రత్యేక పూజలుంటాయని తెలిపారు. శుక్రవారం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

తిరుపతి-కాట్పాడి మధ్య ఏజీఎం తనిఖీలు



తిరుపతి రైల్వేస్టేషన్‌లో నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఏజీఎం

తిరుపతి(ఆటోనగర్) మార్చి 6: తిరుపతి-కాట్పాడి రైలు మార్గంలో బుధవారం దక్షిణ మధ్య రైల్వే ఏజీఎం ఆర్.ధనంజయులు తనిఖీలు చేశారు. ఇంజనీరింగ్, విద్యుత్, సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ శాఖల పనితీరును కిటికీ ద్వారా పరిశీలించారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు సూచించారు. రైల్వేస్టేషన్లను తనిఖీ చేశారు. ముంగిలిపట్టు స్టేషన్‌లో పరిశుభ్రతా ప్రమాణాలు పాటిస్తుండడంతో రూ.500 రివార్డు ప్రకటించారు. తిరుపతి స్టేషన్‌లో జరుగుతున్న భవన నిర్మాణాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గుంతకల్ డివిజన్ అధికారులు యు.సుధాకర్, శ్రావణ్‌కుమార్, మనోజ్‌కుమార్, సుదర్శన్‌రెడ్డి, ఉపేంద్రకుమార్, స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, ఎస్ఎంఆర్ చిన్నప్పరెడ్డి పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా

తిరుపతి(లీగల్), మార్చి 6 : అధిక మోతాదులో మద్యం తాగి వాహనాలు నడిపిన 13 మందికి జరిమానా విధిస్తూ తిరుపతి 4వ అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ తీర్పు చెప్పారు. ఒక్కొక్కరికి 10వేలు చొప్పున జరిమానా విధించారు. వీరిని ట్రాఫిక్ కానిస్టేబుల్ గిరిబాబు కోర్టులో హాజరుపరిచారు.

టీడీపీ-జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలో బీసీలకు అగ్రతాంబూలం



చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న టీడీపీ, రజక సంఘం నేతలు

తిరుపతి (రవాణా), మార్చి 6: టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి మేనిఫెస్టోలో బీసీలకు అగ్రతాంబూలం లభించిందని టీడీపీ కార్పొరేటర్ ఆర్‌సీ మునికృష్ణ, టీడీపీ తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్రనాయుడు అన్నారు. బుధవారం 44వ డివిజన్‌లో చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు రజక సంఘాల నాయకుల ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బీసీల్లో అట్టడుగు స్థాయిలో ఉన్న రజకులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 50 సంవత్సరాలకే రూ.4వేల పింఛను, చంద్రన్న బీమా, రూ.10 లక్షలతో ఆదరణ పథకం కింద పనిముట్లు, పెళ్లికానుక, విదేశీ విద్య, బీసీ పరిరక్షణ చట్టం వంటివి అమలు చేసే దిశగా నిర్ణయం తీసుకున్నారన్నారు. రజకులకు స్థానిక ఆలయాల్లో, ప్రభుత్వ వైద్యశాలల్లో వాషర్ మాన్ పోస్టులను, దోబీఘాట్లపై సర్వహక్కులు కల్పిస్తూ నిర్ణయాలు తీసుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో రజక సాధికార సమితి రాష్ట్ర కార్యదర్శి శంకర్, జిల్లా అధ్యక్షుడు అశోక్, పట్టణాధ్యక్షుడు వెంకటముని, జనసేన నాయకులు సాయి, ధనంజయ, మునిరత్నం, రమేష్, గోపాల్, జయంతి, వాణి, మల్లికార్జున్, సుజాత, భారతి, శైలజ, భాగ్య, నగేష్ ఆచారి, లక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు.

వేదవర్సిటీలో ఓటరు నమోదుపై అవగాహన

తిరుపతి(విద్య),మార్చి6: టీటీడీ ఆధ్వర్యంలో నడిచే ఎస్వీ వేదవర్సిటీలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఓటరు నమోదుపై బుధవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. రిజిస్ట్రార్ రాధాగోవిందత్రిపాఠి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రాజేష్‌కుమార్, పీఆర్వో డాక్టర్ టి.బ్రహ్మాచార్యులు, డాక్టర్ పురుషోత్తమాచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్‌పై టీడీపీ-జనసేన సంబరాలు



తిరుపతి, మార్చి6(ఆంధ్రజ్యోతి) : జయహో బీసీ సభలో వరాలు గుప్పించడంపై స్థానిక టీడీపీ-జనసేన నాయకులు బుధవారం సంబరాలు చేసుకున్నారు. పూలే విగ్రహానికి పాలాభిషేకం,పూలమాల వేసి హర్షం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ ఛైర్మన్ నరసింహ యాదవ్ మాట్లాడుతూ బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్, సమాజంలో ఉన్నతమైన గౌరవం దక్కడానికి ప్రత్యేక రక్షణ చట్టం, స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు, చట్టబద్ధంగా కులగణన, శాశ్వత కుల ధృవీకరణ పత్రాలు, విద్యాపథకాల పునరుద్ధరణ, సబ్‌ప్లాన్ నిధులు వంటి వరాలు టీడీపీ ద్వారానే సాధ్యమన్నారు. అందరూ ఏకమై చంద్రబాబును సీఎం చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ఆర్సీ మునికృష్ణ, దంపూరి భాస్కర్ యాదవ్, పులుగోరు మురళి, కృష్ణ యాదవ్, మహేష్ యాదవ్, బుల్లెట్ రమణ, పుష్పావతి యాదవ్, ఊట్ల సురేంద్ర నాయుడు, రుద్రకోటి సదాశివం, సుబ్బు యాదవ్, ఆనంద్ యాదవ్, కరాటే చంద్ర, రాజయ్య, మునిరామయ్య, జగన్నాథం, జనసేన నాయకులు రాజారెడ్డి, బాబ్జీ, కొండా రాజామోహన్, ముక్కు సత్యవంతుడు, రాజేష్, రుద్రకిషోర్, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

రామరాజ్యం రావాలంటే టీడీపీని గెలిపించాలి



బీసీ డిక్లరేషన్ పోస్టరును ఆవిష్కరిస్తున్న టీడీపీ నేతలు

తిరుపతి(ఆటోనగర్) మార్చి 6 : రాష్ట్ర ప్రజల కష్టాలు తొలగి, రామరాజ్యం రావాలంటే టీడీపీని గెలిపించాలని తిరుపతి మాజీ ఎమ్మెల్యే ఎం.సుగుణమ్మ, టీడీపీ తిరుపతి పార్లమెంట్ నియోజక వర్గ అధ్యక్షుడు జి.నరసింహయాదవ్ విజ్ఞప్తి చేశారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జయహో బీసీ డిక్లరేషన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో జీవించడానికి, సుపరిపాలన అందించడానికి టీడీపీ, జనసేన అధ్యక్షులు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రణాళికలు సిద్ధం చేశారని పేర్కొన్నారు. టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ బీసీలకు రాజకీయాల్లో సముచిత స్థానం కల్పించారన్నారు. నాటి నుంచి టీడీపీ బీసీలకు అండగా నిలిచిందన్నారు. బీసీలకు రక్షణ చట్టం మేనిఫెస్టోలో పొందుపరచడం పట్ల బీసీలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో వైఎస్ జగన్ పాలనలో బీసీలు లక్షలాది ఎకరాల భూములను నష్టపోయారని విమర్శించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు దంపూరి భాస్కర్ యాదవ్, కృష్ణయ్యయాదవ్, బుల్లెట్ రమణ, రుద్రకోటి సదాశివం, మహేష్‌యాదవ్, రాజయ్య పాల్గొన్నారు.

ఆదాయమే పరమావధిగా...

నాలుగు రోజులు తగ్గనున్న షెడ్యూల్ ఆర్టీసీ బస్సులు - నేటి నుంచి శైవక్షేత్రాలకు...ఆదివారం సీఎం సిద్ధం సభకు

తిరుపతి అర్బన్, మార్చి 6: ప్రయాణికుల సౌకర్యాలను పక్కనపెట్టి ఆదాయమే పరమావధిగా ఆర్టీసీ యాజమాన్యం ముందుకు వెళుతోంది. ఇటీవల కాలంలో తరచూ సీఎం బహిరంగ సభలకు అడ్డుఅదుపులేకుండా బస్సులను తరలించడమే దీనికి ఉదాహరణగా చెప్పవచ్చు. సాధారణంగా వరుస సెలవులు, పర్వదినాల్లో ప్రయాణికుల రద్దీ ఉంటుందన్న సమాచారం తెలిసినా ఉన్నతాధికారులు సీఎం సభలకు బస్సులను ఆపలేకపోతున్నారు. శివరాత్రిని పురస్కరించుకుని గురువారం నుంచి శనివారం వరకు జిల్లాలోని ఆయా శైవక్షేత్రాలకు 500 వరకు అదనపు బస్సులను కేటాయించారు. ఆదివారం ఒంగోలులో జరిగే సీఎం సిద్ధం సభకు జిల్లా నుంచి 260 బస్సులను అందుబాటులో ఉంచుతున్నట్లు ఇప్పటికే వైసీపీ నాయకులు ప్రకటించారు. సగానికి సగం బస్సులు ఈ నాలుగు రోజులు సాధారణ ప్రయాణికులకు అందుబాటులో ఉండవు. తిరుమల, కాణిపాకం, ఇతర ప్రాంతాలకు నడిచే బస్సుల సంఖ్యతో పాటు ట్రిప్పులు తగ్గనున్నాయి. ఈ కారణంగా ఉద్యోగులు, విద్యార్థులు, కూలీలు ఇబ్బందులు పడకతప్పదు. శివరాత్రి పర్వదినాన భక్తజనం శైవక్షేత్రాలను సందర్శించడానికి ఇష్టపడతారని, దానికి బస్సులు కేటాయించడంలో అర్థం ఉందని, కానీ పదేపదే సీఎం సభలకు జనసమీకరణకు ఆర్టీసీ బస్సులను కేటాయించడమేమిటని ప్రయాణికులు నిలదీస్తున్నారు. కాగా, ఈ నాలుగు రోజులు అత్యవసరమైతే తప్పా ప్రయాణాలను వాయిదా వేసుకుంటే మంచిదని ఆర్టీసీ అధికారులు సూచనలిస్తుండడం కొసమెరుపు.

చెరువు నీటిలో విష పదార్థాలు వదులుతున్నారు



కలెక్టర్ లక్ష్మీశకు వినతిపత్రం అందజేస్తున్న నాగరాజు

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 6: చిల్లకూరు మండలం కడివేడు గ్రామ చెరువులో ప్రమాదకరమైన విషపదార్థాలు వదులుతున్నారని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశను సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కడివేడు గ్రామంలో పెద్దగుంట తవ్వి విషపూరితమైన రసాయనాలను పంట కాలువ ద్వారా చెరువులోకి వదులుతున్నారని తెలిపారు. ఈ కారణంగా ఆ నీరు తాగి 20 గేదెలు మరణించాయని చెప్పారు. గ్రామస్తులకు చర్మవ్యాధులు వస్తున్నాయన్నారు. గూడూరు ఆర్డీవో, తహసీల్దారుకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. దీనిపై విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి, విచారించి చర్యలు చేపడతామన్నారు.

నేడు గవర్నర్ నజీర్ రాక

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 6 : గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ గురువారం తిరుపతికి రానున్నారు. శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో జరగనున్న స్నాతకోత్సవంలో పాల్గొంటారు. గన్నవరం నుంచి బయలుదేరి ఉదయం 10.20 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని 11.30గంటలకు శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాయలం చేరుకుంటారు. స్నాతకోత్సవంలో పాల్గొని మధ్యాహ్నం 2.50గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని బెంగళూరుకు వెళతారని కలెక్టర్ లక్ష్మీశ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

9న పంజాబ్ గవర్నర్ రాక

పంజాబ్ గవర్నర్ బన్వరిలాల్ పురోహిత్ ఈనెల 9, 10 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నారు. 9వ తేదీ ఉదయం 11.05 గంటలకు చెన్నై విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి మధ్యాహ్నం 2.30గంటలకు తిరుమల పద్మావతి అతిథిగృహం చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు. 10వ తేదీ ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని 10.20గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని బెంగళూరు వెళతారని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

రౌడీ షీటర్లపై ఉక్కుపాదం

మళ్లీ మళ్లీ అఘాయిత్యాలకు పాల్పడితే ఆస్తుల సీజ్

తిరుపతి క్రైం, మార్చి 6 : ఎన్నికలు సమీపిస్తున్న వేళ పోలీసు శాఖ అప్రమత్తమైంది. గత ఎన్నికల్లో జరిగిన ఘటనలను దృష్టిలో పెట్టుకుని తిరుపతి సబ్ డివిజన్ పరిధిలో నేరస్తుల వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పటి వరకూ 482 మందిని బైండోవర్ చేసుకుని వారికి పలు దఫాలుగా కౌన్సెలింగ్ ఇచ్చారు. అందులో 68 మంది రౌడీ షీటర్లున్నారు. వీరు కాకుండా మరో 400 మంది హత్యాయత్నాలు, ఆస్తుల తగాదాలు, కొట్లాటలు, దొమ్మీలు, దోపిడీలకు పాల్పడిన వారు ఉన్నట్లు తిరుపతి సబ్ డివిజన్ పోలీసు అధికారులు గుర్తించారు. మూడు కేసుల కంటే ఎక్కువగా ఉన్న వారిని సి-కేటగిరిగా పరిగణించి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. వీరితోపాటు మరో 1,086 మంది ప్రాపర్టీ అఫెన్సెస్‌లో ఉన్నట్లు గుర్తించారు. కౌన్సెలింగ్ ఇచ్చి, ఆరు నెలలు బైండోవర్ పీరియడ్‌గా నిర్ణయించారు. ఆరు నెలల్లోపు ఎక్కడైనా ఘర్షణలు, దోపిడీలు, హత్యాయత్నాలు, లైంగిక వేధింపులు, మహిళల పట్ల అఘాయిత్యాలు ఇతరత్రా ఘటనలకు పాల్పడితే అరెస్టు చేసి, రిమాండుకు తరలించడానికి చర్యలు తీసుకుంటున్నారు. లక్ష నుంచి రూ.5 లక్షల వరకూ పూచీకత్తు తీసుకుంటారు. మళ్లీ మళ్లీ అఘాయిత్యాలకు, ఇతరత్రా నేరాలకు పాల్పడితే రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం ఆస్తులు సీజ్ చేయనున్నట్లు డీఎస్పీ సురేంద్రరెడ్డి చెప్పారు.

బలిజలకు సముచిత న్యాయం జరగాలి



లోగోను ఆవిష్కరిస్తున్న కృష్ణప్రసాద్

తిరుపతి(ఆటోనగర్), మార్చి 6 : సార్వత్రిక ఎన్నికల్లో బలిజలకు సముచిత న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని బలిజ సేన సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ అన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో బలిజ సేన సంఘం లోగోను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 27శాతం ఉన్న బలిజలకు ప్రధాన రాజకీయ పార్టీలు తగిన ప్రాధాన్యం కల్పించడం లేదన్నారు. ప్రధానంగా గ్రేటర్ రాయలసీమలో బలిజలకు సీట్ల కేటాయింపులో అన్యాయం జరుగుతోందన్నారు. బలిజ కులానికి చెందిన వ్యక్తిని సీఎంను చేసేవరకు సంఘం పోరాటం చేస్తుందన్నారు. అనంతరం రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఆర్కాట్ కృష్ణప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా గోపిరాయల్, కోశాధికారిగా బెల్లంకొండ సురేష్‌బాబు, ఉపాధ్యక్షులుగా ఎర్రంశెట్టి మస్తాన్ రాయల్, రాయని రమేష్‌బాబు, గుండాల వేణురాయల్, రాష్ట్ర కార్యదర్శులు కె.రవి, రమేష్‌బాబు, నందకుమార్, బి.సుహాస్‌తో పాటు ఐదుగురు కార్యవర్గ సభ్యులు, నలుగురు సలహాదారులను నియమించారు.

అయోధ్యకు ప్రత్యేక రైలు



రైలును పచ్చజెండా ఊపి ప్రారంభిస్తున్న కుప్పాల సత్యనారాయణ

తిరుపతి (ఆటోనగర్) మార్చి 6: అయోధ్యను సందర్శించే భక్తుల కోసం తిరుపతి నుంచి బుధవారం ఉదయం ప్రత్యేక రైలు బయలుదేరింది. స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ బీజేపీ నాయకులతో కలిసి పచ్చజెండా ఊపి రైలును ప్రారంభించారు. అయోధ్యలో నిర్మించిన రామ మందిరాన్ని దర్శించుకోవడానికి ఐఆర్‌సీటీసీ దేశ నలుమూలల నుంచి ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా తిరుపతి నుంచి అయోధ్యకు 24 కోచ్‌లతో ప్రత్యేక రైలును ఉదయం 7 గంటలకు ప్రారంభించారు. శుక్రవారం ఉదయం 10.35 గంటలకు అయోధ్యధాంకు చేరుకుంటుందని డైరెక్టర్ తెలిపారు. తిరిగి శనివారం రాత్రి 7.55 గంటలకు అయోధ్యధాంలో బయలుదేరి సోమవారం రాత్రి 11.45 గంటలకు తిరుపతికి చేరుకుంటుందని తెలిపారు. ప్రారంభోత్సవంలో బీజేపీ నాయకులు జి.భానుప్రకాష్‌రెడ్డి, గుండాల గోపినాథ్‌రెడ్డి, చంద్రప్ప, పి.చంద్రశేఖర్, ముని సుబ్రమణ్యం, వి.పద్మ, వేదవతిరాయల్, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు సముచిత స్థానం ఇవ్వండి

తిరుపతి(ఆటోనగర్) మార్చి 6: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించాలని బీసీల సమాఖ్య కన్వీనర్ బి.భాస్కర్‌యాదవ్ డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీలు బీసీలకు కల్లబొల్లి కబుర్లు చెప్పి ఓట్లు వేయించుకుని తర్వాత మొహం చాటేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర జనాభాలో 50 శాతం ఉన్న బీసీలకు ప్రతి జిల్లాలోనూ మూడు అసెంబ్లీ సీట్లు కేటాయించాలని కోరారు. జయహో బీసీ సభలో టీడీపీ, జనసేన పార్టీలు బీసీ డిక్లరేషన్ ప్రకటించడం అభినందనీయమన్నారు. అలాగే అధికార పార్టీ కూడా బీసీల భద్రత చట్టాన్ని ఎన్నికల ప్రణాళికలో పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో విజయఉత్తరాధి, నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.91 కోట్లు

తిరుమల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.91 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి బుధవారం ఉదయం ప్రకటించింది. ఇక, మంగళవారం 64,552 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 19,900 మంది తలనీలాలు సమర్పించారు.

10వరకు చెన్నై సెంట్రల్-తిరుపతి రైళ్ల రద్దు

● 11నుంచి తిరుపతికి బదులుగా తిరుచానూరు నుంచి

పెరంబూర్, మార్చి 6: తిరుపతి సెక్షన్‌లో చేపడుతున్న మరమ్మతుల కారణంగా తిరుపతికి వెళ్లే పలు ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేయగా, మరికొన్ని పాక్షికంగా, మరికొన్నింటిని ఇతర మార్గాల్లో నడుపుతున్నట్లు దక్షిణ రైల్వే పేర్కొంది.

- నెం.06728 తిరుపతి - మూర్ మార్కెట్ కాంప్లెక్స్, నెం.06727 మూర్ మార్కెట్ - తిరుపతి మెమో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈనెల 10వ తేదీ వరకు రద్దు
- నెం.16854 విల్లుపురం - తిరుపతి ఎక్స్‌ప్రెస్, నెం.16853 తిరుపతి - విల్లుపురం ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈ నెల 14వ తేదీ వరకు రద్దు
- నెం.06753 అరక్కోణం - తిరుపతి మెమో, నెం.06754 తిరుపతి - అరక్కోణం మెమో రైళ్లు ఈ నెల 10వ తేదీ వరకు రద్దు
- నెం.17407 తిరుపతి - మన్నార్‌గుడి పమని ఎక్స్‌ప్రెస్ ఈ నెల 10, 12, 14 తేదీలు, నెం.17408 మన్నార్‌గుడి - తిరుపతి పమని ఎక్స్‌ప్రెస్ ఈనెల 11, 13, 15 తేదీల్లో రద్దు
- నెం.16112 పుదుచ్చేరి - తిరుపతి మెమో ఎక్స్‌ప్రెస్ ఈనెల 12 నుంచి 23 వరకు, నెం.16111 తిరుపతి - పుదుచ్చేరి మెమో ఎక్స్‌ప్రెస్ ఈనెల 11 నుంచి 24వ తేదీ వరకు రద్దు

తిరుపతికి బదులుగా తిరుచానూరు...

- నెం.06753 అరక్కోణం - తిరుపతి మెమో, నెం.06727 మూర్ మార్కెట్ కాంప్లెక్స్ - తిరుపతి మెమో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు తిరుపతికి బదులుగా తిరుచానూరు వరకు మాత్రమే నడుస్తాయి. నెం.06754 తిరుపతి - అరక్కోణం మెమో ఎక్స్‌ప్రెస్, 06728 తిరుపతి - మూర్ మార్కెట్ కాంప్లెక్స్ మెమో ఎక్స్‌ప్రెస్ రైలు తిరుపతికి బదులుగా తిరుచానూరు నుంచి బయల్దేరుతాయి.

రేణిగుంట వరకే సప్తగిరి ఎక్స్‌ప్రెస్

- నెం.16057 చెన్నై సెంట్రల్ - తిరుపతి, నెం.16053 చెన్నై సెంట్రల్- తిరుపతి మధ్య నడిచే సప్తగిరి ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈనెల 11 నుంచి 23వ తేది వరకు తిరుపతికి బదులుగా రేణిగుంట వరకు మాత్రమే నడుస్తాయి. అలాగే, నెం.16058 తిరుపతి-చెన్నై సెంట్రల్, నెం.16054 తిరుపతి - చెన్నై సెంట్రల్ సప్తగిరి రైళ్లు తిరుపతికి బదులుగా రేణిగుంట నుంచి బయల్దేరుతాయి.

టీటీడీ రిసెప్షన్ ఓఎస్డీగా సత్రేనాయక్



సత్రేనాయక్ - శైలేంద్రబాబు

తిరుమల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : టీటీడీ తిరుమల రిసెప్షన్ ఓఎస్డీ(ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ)గా సత్రేనాయక్‌ను నియమిస్తూ టీటీడీ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఓఎస్డీగా ఉన్న రామకృష్ణను తిరుపతి ట్రజరీకి బదిలీ చేయగా, ఆ స్థానంలో రెవెన్యూ టాస్క్‌ఫోర్స్ ఏఈవో సత్రేనాయక్‌ను నియమించారు. ఇక ట్రజరీ ఏఈవోగా ఉన్న రవిని టాస్క్‌ఫోర్స్ ఏఈవోగా బదిలీ చేశారు. అలాగే తిరుమల విజిలెన్స్ మూడవ సెక్టార్ ఏవీఎస్వోగా శైలేంద్రబాబును నియమించారు. ప్రస్తుత ఏవీఎస్వో సతీష్‌ను తిరుచానూరుకు బదిలీ చేశారు.

రేపు కపిలతీర్థంలో మహాశివరాత్రి వేడుకలు

తిరుపతి (కల్చరల్), మార్చి 6: కపిలేశ్వరస్వామి ఆలయంలో మహ శివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ తెలిపింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేస్తున్నారు. పార్కింగ్, చలువ పందిళ్లు, మంచినీటి సౌకర్యాలు కల్పిస్తున్నారు.

9న శివపార్వతుల కల్యాణం

కామాక్షి సమేత కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహాశివరాత్రి మరుసటి రోజు శనివారం శివపార్వతుల కల్యాణం ఉంటుంది. సాయంత్రం 6నుంచి రాత్రి 7 గంటల వరకు ఆర్జితసేవగా ఈ కల్యాణం నిర్వహిస్తారు. గృహస్తులు రూ.250 టిక్కెట్టు తీసుకుని ఉత్సవంలో పాల్గొనవచ్చు. లడ్డూ ప్రసాదం ఇస్తారు.

మంచినీళ్లకుంట శివాలయంలో..

తిరుపతి నరసింహ తీర్థం సమీపంలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి రోజున ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు సూర్యనారాయణ శర్మ తెలిపారు. శివ భక్తులు పాల్గొనవచ్చన్నారు.

వెంకన్న సేవలో ప్రముఖులు



కంభంపాటి హరిబాబు - మధుబాల - సంపత్ రాజ్

తిరుమల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు, సినీనటుడు సంపత్ రాజ్ ఉన్నారు. అంతకుముందు సుప్రభాత సేవలో నటి మధుబాల శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

వ్యాఘ్ర, గజ వాహనాలపై కపిలేశ్వరస్వామి



వ్యాఘ్ర, గజ వాహన సేవల్లో కపిలేశ్వర స్వామి

తిరుపతి (కల్చరల్), మార్చి 6: కపిలేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు కామాక్షి సమేత సోమస్కందమూర్తి వ్యాఘ్ర వాహనంపై విహరించారు. భజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ కపిలతీర్థం నుంచి అన్నారావు కూడలి, వినాయక నగర్ క్వార్టర్స్, ఎన్‌జీవో కాలనీ, అలిపిరి బైపాస్ రోడ్డు మీదుగా తిరుగుతూ కపిలతీర్థం చేరుకున్నారు. దారి పొడవునా భక్తులు కర్పూర నీరాజనాలు పట్టారు. అనంతరం ఆలయంలో స్వామిఅమ్మవార్లకు అర్చకులు స్నపన తిరుమంజనం నిర్వహించారు. మధ్యాహ్నం 3నుంచి 3.30 గంటల వరకు స్వామి వారికి అభిషేక సేవ నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి విశేష దీపారాధన జరిగింది. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్వామి అమ్మవార్లు గజ వాహనంపై పురవీధులలో విహరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్ర బాబు, ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు. ఆలయంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గురువారం ఉదయం కల్పవృక్ష, రాత్రి అశ్వవాహన సేవలు ఉంటాయి.

గంగమ్మ సేవలో వడ్డెర సంఘ నేతలు



తిరుపతి (కల్చరల్), మార్చి 6: వడ్డెర కమ్యూనిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఓసీసీఐఐ) జాతీయ అధ్యక్షుడు రవి మోక్లే బుధవారం తిరుపతి తాతయ్యగుంట గంగమ్మను దర్శించుకున్నారు. ఆయనతోపాటు ఓసీసీఐఐ అధికార ప్రతినిధి మల్లకుప్పం శేఖర్, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ముని మారెప్ప, జయరాం, ప్రధాన కార్యదర్శి జయశంకర్, యల్లప్ప, శ్రీధర్, గుండాల గోపినాథ్, వేముల జగన్నాథం తదితరులున్నారు. వడ్డెర జాతికి రాజకీయంగా ప్రాముఖ్యత పెరగాలని అమ్మవారిని వేడుకున్నట్లు రవి తెలిపారు.

గ్రామీణ విద్యార్థులకు సాంకేతికతపై అవగాహన



హాజరైన గ్రామీణ పాఠశాలల విద్యార్థులు

తిరుపతి(విద్య), మార్చి 6: జాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ)2020కి అనుగుణంగా గ్రామీణ పాఠశాల విద్యార్థులకు సైన్స్ టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ పట్ల బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక డీఆర్‌డీఏ హాల్లో జరిగిన అవగాహన కార్యక్రమానికి జిల్లాలోని 30 పాఠశాలల నుంచి 120 మంది విద్యార్థులు హాజరయ్యారు. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణితం విభాగాలకు సంబంధించి ఎంపిక చేసిన ప్రాజెక్టులలో ప్రదర్శించిన వినూత్న నమూనాలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న విద్యాశాఖాధికారి డాక్టర్ వి.శేఖర్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా బాల్యం నుంచి పిల్లలకు మేధోశక్తి అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో ఆనందరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి శివశంకరయ్య, అసిస్టెంట్ మానటరింగ్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, భానుప్రసాద్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

దేశ ఆర్థిక పురోభివృద్ధిలో మహిళల పాత్ర అమోఘం



తిరుపతి(రూరల్), మార్చి6: దేశ ఆర్థిక పురోభివృద్ధిలో మహిళల పాత్ర అనిర్వచనీయమని కోలార్‌లోని దేవరాజ్ అర్స్ ఉన్నత విద్య, పరిశోధనా అకాడమీ వీసీ, స్విమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ బి.వెంగమ్మ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత గ్రామీణ అధ్యయనం, పరిశోధనా అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఆన్‌లైన్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంగమ్మ మాట్లాడుతూ సమాజంలో మహిళలకు విద్య, వైద్యం, ఆర్థిక తోడ్పాటు, నిర్ణయాల రూపకల్పనలో సముచిత స్థానం కల్పించి అమలు చేయడం ద్వారా మహిళా సాధికారిత సాధించవచ్చని తెలిపారు. మాజీ ఐఎఫ్ఎస్ అధికారి సీఎస్ రామలక్ష్మి మాట్లాడుతూ దేశంలో దాదాపు 50వేల స్వయం సహాయక బృంద సమాఖ్యలు పనిచేస్తున్నాయని, వీటిద్వారా వివిధ బ్యాంకులలో రూ.70లక్షల కోట్లను పొదుపుచేసి దేశ ఆర్థిక పురోభివృద్ధికి వెన్నుముకగా ఉన్నాయని, ఇదే మహిళా సాధికారితకు నిలువెత్తు సాక్ష్యమని అభివర్ణించారు. మహిళా సంఘ జాతీయ మాజీ సభ్యురాలు కె.శాంతారెడ్డి మాట్లాడుతూ పార్లమెంటు, శాసనసభల్లో మహిళలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించి సాధికారితకు ప్రాధాన్యత ఇవ్వడం శుభపరిణామమని చెప్పారు. అగ్రశ్రీ(భారత గ్రామీణ అధ్యయనం, పరిశోధనా అకాడమీ) వ్యవస్థాపక డైరెక్టర్ డాక్టర్ డి.సుందరరామ్ మాట్లాడుతూ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ ముగిసిన తర్వాతే మహిళా రిజర్వేషన్లు పరిపూర్ణమవుతాయని చెప్పారు. పద్మావతి వర్సిటీ జర్నలిజం విభాగం హెడ్ ప్రొఫెసర్ కిరణ్‌ప్రసాద్, స్విమ్స్ కార్డియాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ వనజాక్షమ్మ, ఎస్వీయూ ఆర్థికశాస్త్ర విభాగ హెడ్ ఆర్.సునీత, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఏడీ జ్యోతి, అగ్రశ్రీ ఉపాధ్యక్షుడు డి.సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



తిరుపతి సిటీ : తిరుపతి రుయా ఆస్పత్రిలో బుధవారం మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళ ఉద్యోగులకు ముందస్తు శుభకాంక్షలు తెలియజేశారు. రుయా ఏవో రమేష్, అకౌంట్ ఆఫీసర్స్ అనుమతి, హరిప్రసాద్, ఫార్మసీ, నర్సింగ్, మినిస్ట్రీ విభాగాలు, నాలుగో తరగతి మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

వెటర్నరీలో ముగిసిన ఓపెన్‌హౌస్ ఎగ్జిబిషన్



గుర్రపు స్వారీ

తిరుపతి(రూరల్),మార్చి6: ఎస్వీ వెటర్నరీ కళాశాలలో నిర్వహించిన రెండ్రోజుల ఓపెన్‌హౌస్ ఎగ్జిబిషన్(పశు విజ్ఞాన ప్రదర్శన)బుధవారంతో ముగిసింది. నగరంలోని పలు విద్యాసంస్థలకు చెందిన దాదాపు 800 మంది విద్యార్థులు ఈ ప్రదర్శనను సందర్శించారని కళాశాల అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ జగపతిరామయ్య పేర్కొన్నారు. కాగా సాయంత్రం కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన డాగ్‌షో, ఎన్‌సీసీ విద్యార్థుల హార్స్ రైడింగ్ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ షోను వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణాచలం రవితో డీన్ ప్రొఫెసర్ డాక్టర్ కె.వీరబ్రహ్మయ్య, డీఎస్ఏ ప్రొఫెసర్ డాక్టర్ జేవీరమణ కలసి ప్రారంభించారు. ఫిజియాలజీ హెడ్ ప్రొఫెసర్ డాక్టర్ బి.రాంబాబునాయక్, డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి, డాక్టర్ మురళి, డాక్టర్ తిరుపతిరెడ్డి, వ్యాయామ విభాగం హెడ్ డాక్టర్ జయచంద్ర పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 954మంది గైర్హాజరు

తిరుపతి(విద్య), మార్చి 6 : ఇంటర్ ప్రథమ సంవత్సర పబ్లిక్ పరీక్షలకు బుధవారం జిల్లాలో 954మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్ఐవో జీవీ ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు. జనరల్, ఒకేషనల్ విభాగాల్లో 34,379మందికిగాను 33,425 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాశారని వివరించారు. జనరల్‌లో 32,985మందికి 32,150 మంది హాజరవ్వగా.. 835మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో1,394మందికి 1,275 మంది హాజరవ్వగా..119మంది విద్యార్థులు హాజరుకాలేదు. మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని పేర్కొన్నారు.

వైసీపీ విధ్వంస పాలనను అంతమొందించాలి

చిల్లకూరు, మార్చి 6: రాష్ట్రంలో విధ్వంసపాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో అంతమొందించాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ పాలనలో విద్యుత్, బస్సు చార్జీలు పెంచడంతో రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైసీపీ అరాచకపాలనతో ప్రజలు విసిగిపోతున్నారన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి మార్గంలో నడిపించుకునేందుకు చంద్రబాబుని సీఎంగా గెలిపించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సన్నారెడ్డి వెంకటరమణారెడ్డి, వెంకటేశ్వర్లు రెడ్డి, గుండాల లీలావతి, నెల్లటూరు చిరంజీవి, అన్నం మునిశేఖర్‌గౌడ్, సుప్రజ, నల్లం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

గూడూరు అర్బన్, మార్చి 6: రాష్ట్రంలో ఉన్న అన్ని మున్సి పాలిటీలలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మి కులందరినీ పర్మినెంట్ చేయాలని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమా మహేశ్వరరావు కోరారు. బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు 16 రోజుల పాటు పోరాటాలు చేసి పలు సమస్యలను పరిష్కరించుకున్నామన్నారు. ఇది కార్మికుల పోరాట విజయం అన్నారు. కార్మికులంతా ఐకమత్యంతో ఉంటే ఎంతటి సమస్యనైనా పరిష్కరించుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో బాలసుబ్రమణ్యం, జోగి శివకుమార్, రాజగోపాల్, గోపినాథ్, బీవీరమణయ్య, సురేష్, రమేష్, కోటేశ్వరరావు, ప్రభావతి, సంపూర్ణమ్మ పాల్గొన్నారు.

వాయు శివలింగ దర్శనం ఏర్పాటు



సమావేశంలో ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయ సభ్యులు

గూడూరు అర్బన్, మార్చి 6: శివరాత్రి పర్వదినం సందర్భంగా స్థానిక రెండోపట్టణ పరిధిలోని నరసింగ రావుపేటలో గల ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాల యలో ఈ ఏడాది వాయు శివలింగ దర్శనం ఏర్పాటు చేస్తున్నట్లు విశ్వవిద్యాలయ సభ్యులు తెలియజేశారు. బుధవారం స్థానిక విశ్వవిద్యాలయంలో సభ్యులు మాట్లాడుతూ ప్రతిఏడాదీ శివరాత్రి సందర్భంగా శివలింగాలను భక్తుల సందర్శనార్థం ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ ఏడాది వాయుశివలింగ దర్శనం ఏర్పాటు చేస్తున్నామని భక్తులు పాల్గొని దర్శించుకోవాలని కోరారు.

రాజీవ్ నగర్ లో ఆగని భూకబ్జాలు



రాజీవ్ నగర్ లో అక్రమార్కులు చదును చేసిన భూమి

శ్రీకాళహస్తి, మార్చి 6:శ్రీకాళహస్తి పట్టణ శివారులోని రాజీవ్ నగర్‌లో భూకబ్జాలు ఆగడం లేదు. భూ ఆక్రమణపై స్థానికులు ఎదురు తిరగడంతో అక్రమార్కులు పరారైన ఘటన బుధవారం చోటు చేసుకుంది. రాజీవ్ నగర్ కాలనీ ప్రధాన రోడ్డుకు దక్షిణం వైపు భవిష్యత్తులో రోడ్డు విస్తరణ కోసం ఖాళీ స్థలాలు విడిచి పెట్టారు. దానిపై అధికార పార్టీ నేతలు కన్నేశారు. బుధవారం యంత్రాలతో ఆ స్థలాలను ఆగమేగాలపై చదును చేశారు. స్థానికులు అడ్డుకోవడంతో కబ్జాదారులు అక్కడి నుంచి పరారయ్యారు. అధికారులు రాజీవ్ నగర్ స్థలాలను కాపాడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

8న సిద్దేశ్వరాలయంలో శివరాత్రి వేడుకలు

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 6: మండలంలోని ఉబ్బలమడుగు జలపాతంలో పురాతన సిద్దేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 8న జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు రావాలని ఆలయ కమిటీ సభ్యులు, కల్లివెట్టు సర్పంచ్ రాగమ్మ బుధవారం పలువురిని ఆహ్వానించారు.. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుడు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ సిద్దేశ్వర కోనలోని శివాలయంలో ప్రతి శివరాత్రికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వరదయ్యపాళెంలోని లోకా ఫౌండేషన్ ప్రసిడెంట్ లోకేష్‌కు ఆహ్వాన పత్రిక అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాసులు రెడ్డి, తిరుపాలయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి వాలీశ్వరాలయంలో ..

వరదయ్యపాళెం, మార్చి 6: మండలంలోని సంతవేలూరు కామాక్షి సమేత వాలీశ్వరస్వామి ఆలయంలో గురువారం నుంచి మహాశివరాత్రి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త మయాణి శేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ స ందర్భంగా ఆయన మాట్లాడుతూ 7న ఉదయం 9గంలకు గణపతిపూజతో ఉత్సవాలు ప్రారంభించి. 8వ తేదీ శుక్రవారం మహాశివరాత్రి రోజున ఉదయం 6గంటలకు పూజానంతరం సర్వదర్శనం కల్పించనున్నారు. మధ్యాహ్నం లింగోద్భవం, అన్నదానం నిర్వహించనున్నారు. 9వ తేదీ శనివారం శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు శేఖర్‌రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతానికి ఎద్దుల మృతి

పిచ్చాటూరు, మార్చి 6: విద్యుత్ షాక్‌కు గురై ఎద్దులు మృతి చెందిన సంఘటన పిచ్చాటూరు మండల పరిధిలోని పులికుంద్రం గ్రామంలో బుధవారం జరిగింది. వివరాలు ఇలా... మాలగుంట గ్రామానికి చెందిన రవి ఎద్దులు బుధవారం ఉదయం పులిగుంద్రం గ్రామానికి చెందిన సెల్వం పొలంలో మాను తోలుతుండగా ఘటన జరిగినట్లు సమాచారం. విద్యుత్‌శాఖ, పశు సంరక్షణ శాఖ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కరెంటు పాసైనట్టుగా ప్రాథమిక నిర్ధారణ చేశారు.



కూలి పనికి వెళ్లిన రవి పరిస్థితిని అర్థం చేసుకునే క్రమంలో రెండు ఎద్దులు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాయి. రైతు ముందే ఎద్దులు మృతి చెందడం రైతు బోరున విలపించాడు. ప్రభుత్వం తనను ఆర్థికంగా ఆదుకోవాలని రవి కోరాడు. ఈ మేరకు పశు సంవర్ధకశాఖ, విద్యుత్‌శాఖ అధికారులకు, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు.

పురందేశ్వరిని కలసిన రాఘవరాజు

పిచ్చాటూరు, మార్చి 6: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని బుధవారం ఆ పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబరు పిచ్చాటూరుకు చెందిన వ్యాపారవేత్త రాఘవరాజు విజయవాడ పార్టీ కార్యాలయంలో కలిశారు. సత్యవేడు నియోజకవర్గంలో పార్టీ విస్తరణ కోసం పల్లెల్లో విస్తృతంగా పర్యటించి ప్రజావాణి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. తిరుపతి ఎంపీ సత్యవేడు ఎమ్మెల్యే బీజేపీ అభ్యర్థుల విజయం కోసం పార్టీనాయకులతోకలసి అహర్నిశలు శ్రమిస్తామని ఆమెకు వివరించారు. పార్టీ ప్రతిష్ట ప్రధాన ధ్యేయంగా ముందుకెళ్లాలని ఆమె సూచించారు.

ముక్కంటి సేవలో సినీ నటులు





ముక్కంటి ఆలయంలో తమిళ నటుడు గణేష్ - నటుడు సంపత్

శ్రీకాళహస్తి, మార్చి 6: జ్ఞానప్రసన్నాంబికా సమేత శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని తమిళ హాస్య నటుడు గణేష్, నటుడు సంపత్ బుధవారం వేరువేరుగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి దర్శన ఏర్పాట్లు చేశారు. గురు దక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. సినీ నటులతో సెల్ఫీలు తీసుకునేందుకు భక్తులు, స్థానికులు ఆసక్తి చూపారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

జాతీయ రహదారికి సబ్‌వేలు నిర్మించాలి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

నాయుడుపేట, మార్చి 6 : నాయుడుపేట -రేణిగుంట జాతీయ రహదారి ఆరు లేన్ల నిర్మాణంలో భాగంగా నాయుడుపేట ప్రాంతం వద్ద సబ్‌వేలు ఏర్పాటు చేయాలని బీజేపీ ఎస్సీ సెల్ మాజీ రాష్ట్ర కార్యదర్శి విజయభాస్కర్ కోరారు. బుధవారం మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడును వెంకటాచలంలో కలసి వినతిపత్రం అందజేశారు.

హత్యకేసులో జీవితఖైదు

గూడూరు, మార్చి 6: నాయుడుపేట మండలం అన్నమేడు గ్రామంలో జరిగిన ఓ హత్యకేసులో నిందితుడికి జీవితఖైదుతో పాటు రూ. 5వేలు జరిమానా విధిస్తూ బుధవారం ఏడవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి తీర్పునిచ్చారు. కోర్టు సిబ్బంది కథనం మేరకు... అన్నమేడు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లుకు అతని బావమరిది వీరాస్వామికి మధ్య పాత కక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో 2022 డిసెంబరు 16వ తేదీ గ్రామంలోని ఓ దుకాణం వద్ద ఉన్న వెంకటేశ్వర్లును వీరాస్వామి డబ్బులివ్వాలని అడిగాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగి వీరాస్వామి సూరికత్తితో వెంకటేశ్వర్లును పొడవడంతో అతడు మృతి చెందాడు. అప్పట్లో నాయుడుపేట పోలీసులు కేసునమోదు చేసుకుని నిందితుడు వీరాస్వామిని అరెస్ట్‌చేసి కోర్టుకు తరలించారు. ఈ కేసులో వాదోపవాదనలు విన్న న్యాయస్థానం నిందితుడికి శిక్ష ఖరారు చేసింది. బాధితుల తరుపున ఈ కేసును ఏపీపీ సుహాసిని వాదించారు.

రేణిగుంటకు చేరుకున్న కేంద్ర బలగాలు

రేణిగుంట, మార్చి 6: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం రేణిగుంటకు కేంద్ర భద్రతా బలగాలు చేరుకున్నాయి.. 200మంది బీఎస్ఎఫ్ జవాన్లు రేణిగుంట రైల్వేస్టేషన్‌కు చేరుకోగా వారిలో 70మందిని నెల్లూరు జిల్లాకు తరలించారు. మిగిలిన 130మందిని తిరుపతి జిల్లాకు కేటాయించారు. ప్రస్తుతానికి రేణిగుంట పాత విమానాశ్రయం వద్ద వారికి బస ఏర్పాటు చేశారు.

బీజేపీని ఆదరించండి

శ్రీకాళహస్తి, మార్చి 6: వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలని ఆ పార్టీ నాయకులు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని కొండమెట్ట ప్రాంతంలో బుధవారం బీజేపీ అభివృద్ధి కార్యక్రమాలపై ఇంటింటికి ప్రచారం. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పేదల సంక్షేమం కోసం ప్రధాని నరేంద్ర మోడీ అమలు చేసిన పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయనున్న బీజేపీ అభ్యర్థి కోలా ఆనంద్‌ను గెలిపించాలని కోరారు. రమేష్ బాబు, అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

తొట్టంబేడు: కేంద్రప్రభుత్వ పథకాలను చూసి ఓటెయ్యాలని శ్రీకాళహస్తి నియోజకవర్గ కో కన్వీనర్ మెళాగారం సుబ్రమణ్యంరెడ్డి అన్నారు. మండలంలోని చేమూరు, చియ్యవరం గ్రామాలలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. . కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెడెంక్రిష్ణయ్య, రవిఆచ్చారి, మునిరాజ, రవిచంద్ర, బిందు, లోకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో సరస్వతీ ఆలయం



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కేవీబీపురం మార్చి6: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 1977 నుండి 1982 విద్యా సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థులు తాము చదివిన పాఠశాలలో సరస్వతీ ఆలయం నిర్మించారు. బుధవారం కుంబాబిషేకం నిర్వహించి ఆలయాన్ని ప్రారంభించి సరస్వతి దేవి విగ్రహన్ని అవిష్కరించారు.

పుత్తూరు వార్తలు

విద్యా సామగ్రి వితరణ



విద్యార్థులకు సామగ్రి బహుకరిస్తున్న ఉపాధ్యాయుడు శ్రీరాములు

పుత్తూరు అర్బన్, మార్చి 6: మండల పరిధిలోని గొల్లపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థులకు ఆ పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు శ్రీరాములు విద్యా సామగ్రిని వితరణగా అందించారు. మంగళవారం తన సొంత ఖర్చులతో పెన్నులు, ప్యాడ్‌లు, జామెంట్రీ బాక్సులను అందించారు. హెచ్ఎం భారతి, ఉపాధ్యాయుడు శ్రీరాములును అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు భారతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని కోరారు.

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా విజయబాబు



పుత్తూరు అర్బన్, మార్చి 6: టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా పుత్తూరుకు చెందిన ఆ పార్టీ నాయకుడు పోతుగుంట విజయబాబు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ తనపై నమ్మకంతో కీలకమైన బాధ్యతలు అప్పగించిన టీడీపీ అధినేత చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో నగరి నియోజకవర్గంలో టీడీపీ భారీ మెజార్టీతో గెలిచేందుకు తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

యువతను మోసం చేసిన వైసీపీ



పార్టీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, మార్చి 6: అధికారంలోకి వస్తే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా వైసీపీ ప్రభుత్వం యువతను మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ విమర్శించారు. బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాలకు చెందిన యువత టీడీపీలో చేరడంతో స్థానిక రైతుబజారు నుంచి టీడీపీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. యువత మాజీ ఎమ్మెల్యేను చీనికాయలతో చేసిన గజమాలతో సన్మానించారు. అనంతరం స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీలో చేరిన వారికి పసుపు కండువాలను కప్పి మాజీ ఎమ్మెల్యే ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అసమర్థ, అరాచక పాలనతో రాష్ట్రం సర్వనాశనమైందన్నారు. గాడితప్పిన రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించాలంటే చంద్రబాబుకే సాధ్యమవుతుందన్నారు. టీడీపీ ప్రభుత్వంలో యువతకు ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. వలంటీర్ల వ్యవస్థను తొలగించేది లేదని టీడీపీ అధికారంలోకి వస్తే వారికి వేతనాలు పెంచుతామన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, కరీముల్లా, రవీంద్రరెడ్డి, మస్తాన్‌నాయుడు, వెంకటేశ్వర్లు, శ్రీధర్, ప్రణీత్, చరణ్, సిద్ధయ్యనాయుడు, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు పాలాభిషేకం

స్థానిక పార్టీ కార్యాలయంలో బీసీ నాయకుల ఆధ్వర్యంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే 50 సంవత్సరాలు నిండిన బీసీలకు రూ. 4వేలు పెన్షన్ అందజేస్తామని, రిజర్వేషన్‌లను పెంచుతామని చంద్రబాబు ప్రకటించడంతో ఇలా అభిమానం చాటుకున్నారు.

విజయానికి కేరాఫ్.. నెలవల కుటుంబం

- వైసీపీ దౌర్జన్యాలను దీటుగా ఎదుర్కొంటాం
- నా కుమార్తెను ఆశీర్వదించండి
- నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల



సమావేశంలో మాట్లాడుతున్న నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట టౌన్, మార్చి 6 : విజయానికి కేరాఫ్ నెలవల కుటుంబం అని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. నాయుడుపేట - శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డు సమీపంలో ఉన్న శ్రీనివాస ఫంక్షన్ హాలులో బుధవారం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి విజయశ్రీ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ తాను గానీ, తన సతీమణి అమృతసరళ గానీ ఇప్పటివరకు పోటీచేసి విజయమే సాధించా మేగానీ ఓటమి అనేది లేదన్నారు. తమ కుమార్తె విజయశ్రీని సైతం ఆశీర్వదించి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. వైసీపీ దౌర్జన్యాలను దీటుగా ఎదుర్కొంటామని తమ కార్యకర్తల జోలికివస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. టీడీపీ సీనియర్ నేత వేనాటి సతీష్‌రెడ్డి మాట్లాడుతూ సమయం ఆసన్నమైందని ప్రస్తుతం రాష్ట్రంలో నడుస్తున్న రాక్షసపాలనకు ప్రజలు ఓటు అనే ఆయుధంతో గుణపాఠం చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, కందల కృష్ణారెడ్డి, ఆదవరం నాగూరయ్య, గూడూరు ప్రభావతమ్మ, సుధీర్‌రెడ్డి, కట్టా రమణారెడ్డి, పసల గంగాప్రసాద్, 786 రఫీ, నెలవల రాజేష్, సుబ్బారావు, రవి, నారాయణ తదితరులు ఉన్నారు.

తహసీల్దారు కార్యాలయం వద్ద ఎర్రగుట్ట వాసుల ధర్నా



రేణిగుంట, మార్చి 6: మండలంలోని ఎర్రగుట్టలో గుడిసెలు ఖాళీ చేయించి పదిరోజుల వుతున్నా బాధితులకు ఇంత వరకు న్యాయం చేయలేదని ఇళ్లస్థలాల పోరాట కమిటీ ప్రశ్నించింది. రేణిగుంట తహసీల్దారు కార్యాలయం వద్ద ఎర్రగుట్ట గుడిసెవాసులతో కలిసి బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్లస్థలాల పోరాట కమిటీఅధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడుతూ కరంబాడి పంచాయతీలో జగనన్న పట్టాలు ఇచ్చి మూడున్నరేళ్ల అవుతున్నా స్థలం చూపలేదన్నారు. కరకంబాడీలో ఫోర్‌లైన్ హైవేలో పోతున్న ఎస్సీ, ఎస్టీ కాలనీప్రజలకు నష్టపరిహారంతో పాటు ఐదు సెంట్ల స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. మరోపక్క కరకంబాడి పంచాయతీలో ప్రభుత్వ భూములు కబ్జాదారులు ఆక్రమణలు చేస్తున్నారెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరమని ఆవేదన వ్యక్తం చేశారు. పది రోజుల్లో న్యాయం చేస్తామని ఎర్రగుట్ట వాసులకు ఆర్డీవో ఇచ్చిన హామీ తప్పారన్నారు. కలెక్టర్, తహసీల్దారు జోక్యంచేసుకుని పేదలకు న్యాయంచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇళ్ల స్థలాల పోరాట కమిటీ సభ్యులు సత్యప్రశాంతకుమారి, దీప, జ్యోతీష్, లోకేష్, అమీర్‌జాన్, మునిరాజమ్మ,అరుణ్‌కుమార్, పవిత్ర, పార్వతి, మణి, సుభాష్, సుధాకర్,మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల నృత్యప్రదర్శన





మోక్షశ్రీ బృందం నృత్యప్రదర్శన - శివాన్స్‌డాన్స్ అకాడమి శివకుమార్ భరతనాట్యం

తొట్టంబేడు, మార్చి 6: శ్రీకాళహస్తి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పట్టణంలోని స్వర్ణముఖి నదీతీరాన ఏర్పాటు చేసిన ధూర్జటి కళాప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. శ్రీకాళహస్తి ది స్కూల్ విద్యార్థులు కీర్తనారెడ్డి, విమలేష్ రెడ్డి భక్తిరంజని కార్యక్రమం భక్తులను మైమరిపించింది. అనంతరం తిరుచానూరు, శివనాటక కళానిలయం వారిచే నృత్యప్రదర్శన, తిరుపతి, మోక్షశ్రీ బృందం నృత్యప్రదర్శన, హైదరాబాద్, శివాన్స్‌డాన్స్ అకాడమి శివకుమార్ నృత్యప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. కళాకారులను దేవస్థానం అధికారులు సత్కరించి స్వామిఅమ్మవార్ల చిత్రపటం, తీర్థప్రసాదాలుఅందజేసారు.

సిద్దేశ్వరాలయంలో మహాసుదర్శన హోమం



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

ఏర్పేడు, మార్చి 6: ఏర్పేడు మండలం చిందేపల్లిలో వెలసిన పార్వతీ సమేత సిద్దేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు బుధవారం వైభవంగా వేదపండితుల ఆధ్వర్యంలో సుదర్శన హోమం జరిగింది. ఉదయం 7.30గంటలకు మహాలక్ష్మి అనుగ్రహం కోసం అష్టోత్తర శత కమల పుష్పాలతో శ్రీసూక్త హోమం జరిగింది. అనంతరం మహా సుదర్శన నృసింహ హోమం, సాయంత్రం మహాలింగార్చన జరిగాయి. ఈ పూజల్లో విశేషంగా భక్తులు పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ ధర్మకర్త గంగలపూడి గిరిధర్‌రెడ్డి, సర్పంచ్ చెన్నూరు పెంచలయ్య, గ్రామపెద్దలు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత మృతి



గురునాథంశెట్టి (ఫైల్‌ఫొటో)

ఏర్పేడు, మార్చి 6: టీడీపీ సీనియర్ నాయకులు జంగం గురునాథం శెట్టి(88) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఎన్టీఆర్ అభిమాని అయిన ఆయన వాకాడు మండలం విద్యానగర్‌లో ఉపాధ్యాయుడిగా, బ్రాంచ్ పోస్టుమాస్టర్‌గా పనిచేశారు. టీడీపీ నియోజకవర్గఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి , ఆయన తల్లి బృందమ్మ తదితరులు గురునాథం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు

టీడీపీతోనే బీసీలకు న్యాయం : భానుప్రకాష్



మాట్లాడుతున్న గాలి భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, మార్చి 6: బీసీలకు సామాజిక న్యాయం ఒక్క టీడీపీతోనే సాధ్యమని నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ పునరుద్ఘాటించారు. బుధవారం ఆయన విలేకరులతో మాటాడుతూ త్రికరణశుద్ధిగా బీసీల అభ్యున్నతి కోసం పాటుపడే పార్టీ ఒక్క టీడీపీ మాత్రమేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీసీలకు తీరని అన్యాయం జరిగిందని ధ్వజమెత్తారు. సుమారు 300 మందికి పైగా బీసీలు హత్యలకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించి వారి అభివృద్ధికి జగన్ సర్కార్ ద్రోహం చేసిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ఉన్న 34 శాతం రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించి వారి రాజకీయ ఎదుగుదలను జగన్ అడ్డుకున్నారని మండిపడ్డారు. స్వయం ఉపాధి యూనిట్లు, ఆదరణ తదితర పథకాలను రద్దు చేయ డంతో బీసీ యువత నిర్వీర్య మైందన్నారు. మంగళ వారం జయహో బీసీ బహిరంగసభ ద్వారా టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ కళ్యాణ్ సంక్షేమం, అభివృద్ధితో పాటు రాజకీయ ఎదుగుదలకు వరాలు ప్రకటించారని కొనియాడారు. 50 ఏళ్లకే పింఛన్ అమలుతో పాటు ఆ మొత్తాన్ని నెలకు రూ.4 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అలాగే బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్‌ను తిరిగి 34 శాతానికి పెంపు, సబ్ ప్లాన్ కింద రూ.75 వేల కోట్లు వ్యయం, స్వయం ఉపాధి పథకాలకు రూ.10 వేల కోట్లు, ఆదరణ పునరుద్ధరణ, పారిశ్రామిక ప్రోత్సాహకాలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, షరతులు లేకుండా విదేశీ విద్య, పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్టడీ సర్కిల్, విద్యాజ్యోతి పథకాల పునఃప్రారంభం, చంద్రన్న బీమా రూ.10 లక్షలకు పెంపు, పెళ్లి కానుకపై రూ.లక్ష పెంపు తదితర వాగ్దానాలు బీసీల సామాజిక న్యాయానికి చంద్రబాబు కట్టుబడి ఉన్నట్లు ప్రకటించారని తేల్చి చెప్పారు. జగన్ ప్రభుత్వ అబద్ధపు హామీలు, వంచనలను బీసీలు నమ్మవద్దని టీడీపీ, జనసేనకు మద్దతుగా నిలవాలని ఆయన కోరారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

మహిళా రిజర్వేషన్లు మోదీ ఘనతే



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పద్మావతి

పుత్తూరు అర్బన్, మార్చి 6: దశాబ్దాలుగా పార్లమెంటు గడప దాటని మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదింప చేసి మహిళలకు రాజ్యాధికారానికి మార్గం సుగుమం చేసిన ఘనత ప్రధాని నరేంద్రమోదీకే దక్కుతుందని ఆ పార్టీ మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ పద్మావతి కొనియాడారు. బుధవారం పట్టణంలోని హిమజ డిగ్రీ కళాశాలలో మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు నిషిధరాజు అధ్యక్షతన నారీ శక్తికి వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక గిరిజన మహిళను రాష్ట్రపతి పదవికి ఎంపిక చేసి మహిళా పక్షపాతిగా ప్రధాని మోదీ నిరూపించుకున్నారని గుర్తు చేశారు. మహిళల అభివృద్ధి అనేది నిరంతరాయ ప్రక్రియ అని దానికి మహిళలే నేతృత్వం వహించాలని ప్రధాని ప్రకటించారని గుర్తు చేశారు. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా నారీ శక్తి వందనం పేరుతో 2కే రన్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు వేదవతి రాయల్, మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సమావేశ మందిరం ప్రారంభం



పుత్తూరు, మార్చి 6 : గేట్‌పుత్తూరులో రూ.43 లక్షలతో నిర్మించిన జగనన్న సమావేశ మందిరాన్ని బుధవారం మంత్రి రోజా ప్రారంభించారు. అలాగే రూ.25 లక్షలతో నిర్మించనున్న మందిరం ప్రహరీకి, తుడ పార్కుకు మంత్రి భూమి పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాటాడుతూ శెంగుందర్‌లు అధికంగా నివసించే ప్రాంతంలో నిర్మించిన ఈ మందిరంలో ఉచితంగా శుభకార్యాలు, సమావేశాలు నిర్వహించుకోవచ్చునిఅన్నారు. రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సెల్వమణి, మున్సిపల్ చైర్మన్ హరి, వైస్‌చైర్మన్లు జయప్రకాష్, శంకర్, కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి పాల్గొన్నారు.

నందిమంగళం దళితవాడలో నీటి ఎద్దడి

పుత్తూరు అర్బన్, మార్చి 6: మున్సిపల్ పరిధిలోని నందిమంగళం దళితవాడలో తాగునీటి ఎద్దడిని శాశ్వతంగా పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. దళితవాడలో సుమారు 300 కుటుంబాలు నివసిస్తుండగా, అందులో 50 కుటుంబాలకు తాగునీటి సమస్య వేధిస్తోంది. పరిష్కారం కోసం ప్రత్యేకంగా పైప్‌లైన్, బోరును ఏర్పాటు చేయాలని వారు పలుమార్లు అధికారులను కలిసి విజ్ఞప్తి చేశారు. కొంత కాలం క్రితం 'గడప గడపకూ మన ప్రభు త్వం' కార్యక్రమంలో భాగంగా మంత్రి రోజా నూతన పైప్‌లైన్ ఏర్పాటుకు భూమి పూజను చేశారు. అయితే ఇప్పటి వరకు పనులు ప్రారంభంకాలేదని స్థానికులు వాపోతున్నారు. రెండు, మూడు రోజులకోసారి మున్సిపాలిటీ ట్యాంకర్ ద్వారా అందించే నీరు తప్ప తమకు వేరే ప్రత్యామ్నాయం లేదని విచారం వ్యక్తం చేస్తున్నారు. వేసవి సమీపిస్తుండడంతో తాగునీటి ఎద్దడి మరింత ఎక్కువ కానుందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికా రులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు



తెప్పలను పరిశీలిస్తున్న అధికారులు

తెప్పల సామర్థ్యం పరిశీలన

శ్రీకాళహస్తి, మార్చి 6: తెప్పల సామర్థ్యాన్ని అధికారుల బృందం పరిశీలించింది. ఉత్సవాల్లో భాగంగా మహాశివరాత్రి మరుసటి రోజు రాత్రి నారద పుష్కరిణిలో స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం జరుగుతుందనే విషయం తెలిసిందే. గతంలో టీటీడీ తెప్పలను ఉపయోగించేవారు. ఈ ఏడాది ముక్కంటి ఆలయం తరపున స్వామి అమ్మవార్లకు రెండు తెప్పలను తయారు చేయించారు. బ్రహ్మోత్సవాల ప్రత్యేక అధికారి మూర్తి, ఈవో నాగేశ్వరరావు, ఇరిగేషన్ ఈఈ మదన గోపాల్, ఆలయ ఈఈ నూకరత్నమ్మ అధికారుల బృందం తెప్పలకు ట్రైల్ రన్ నిర్వహించారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే తెప్పలను పరిశీలించారు. కాగా రథాల సామర్థ్యాన్ని గురువారం ఆర్ అండ్ బి అధికారులు ధ్రువీకరించనున్నారు.

మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు

శ్రీకాళహస్తి, మార్చి 6: మహాశివరాత్రిని పురస్కరించుకుని శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డీఎం రాజవర్ధన్ రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. శ్రీకాళహస్తి నుంచి తిరుపతి మార్గంలో ప్రతి ఐదు నిమిషాలకు బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. అలాగే తిరుపతి శ్రీకాళహస్తి మధ్య తిరిగే నాన్ స్టాప్ బస్సులు స్వర్ణముఖి నది వద్ద దర్గా మిట్ట ప్రాంతం నుంచి రాకపోకలు సాగిస్తాయన్నారు. శ్రీకాళహస్తి నుంచి గుడిమల్లంకు ఉదయం 10 గంటలకు, మధ్యాహ్నం ఒంటిగంట 1:30 నిమిషాలకు, సాయంత్రం 4 గంటలకు బస్సు సౌకర్యం కల్పించినట్లు వెల్లడించారు. నాయుడుపేట వైపు ప్రతి 30 నిమిషాలకు, పిచ్చాటూరు మార్గంలో ప్రతి 20 నిమిషాలకు బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు.

బీసీ రక్షణ చట్టం చారిత్రక నిర్ణయం

- చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



సమావేశానికి హాజరైన బీసీ నాయకులు

శ్రీకాళహస్తి, మార్చి 6: టీడీపీ అధినేత నారా చంద్రబాబు బీసీ రక్షణ చట్టం ప్రకటించడం చారిత్రక నిర్ణయం అని ఆపార్టీ బీసీ నాయకులు అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బీసీ విభాగం నాయకులు బుధవారం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీల పక్షపాతిగా నిలిచిందన్నారు. అనంతరం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తూ జేజేలు పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు డాక్టర్ ఉమేష్ రావు, మిన్నల్ రవి, కన్నవరం హరిబాబు, దొరై రాజ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సేవలందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రవిశంకర్ రెడ్డి

శ్రీకాళహస్తి, మార్చి 6: భక్తులకు మెరుగైన సేవలు అందించాలని శ్రీకాళహస్తి ఆర్డీవో రవి శంకర్ రెడ్డి సూచించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పరిపాలన భవనంలో బుధవారం ప్రభుత్వ శాఖల అధికారులతో ఉత్సవాల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ రెడ్డి విభాగాల వారీగా ఉత్సవాల ఏర్పాట్లపై ఆరా తీశారు. అలాగే ఆలయంలో క్యూలైన్ల నిర్వహణ, అన్నప్రసాదాలు పంపిణీ, ప్రసాదాల తయారీ, భక్తులకు వసతి ఏర్పాట్లు, బాల్య వివాహాల నిర్మూలన, ఉత్సవాల సమయపాలన అంశాలపై సూచనలు చేశారు. మహాశివరాత్రి ఉత్సవాల ప్రత్యేక అధికారి మూర్తి, ఈఓ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్కూటర్‌ను ఢీకొన్న కారు: ముగ్గురికి గాయాలు



చికిత్స పొందుతున్న సుకన్య

తొట్టంబేడు, మార్చి 6: స్కూటర్‌ను కారు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలైన సంఘటన తొండమనాడు క్రాస్ వద్ద బుధవారం చోటుచేసుకొంది. బంధువుల కథనం మేరకు.. శ్రీకాళహస్తి మండలం బూరమాలకండ్రిగకు చెందిన దంపతులు సురేష్, సుకన్య తమకుటుంబ సభ్యుడు చందుతో కలిసి స్వగ్రామం నుంచి కరకంబాడిలోని కట్టాపుట్టాలమ్మ దర్శనానికి బయలుదేరారు. రేణిగుంట నుంచి శ్రీకాళహస్తి వైపు వస్తున్న కారు వారిని తొండమనాడు క్రాస్ వద్ద ఢీకొనడంతో ముగ్గురు చెల్లాచెదురుగా పడిపోయారు. చందు, సురేష్‌లకు తీవ్ర గాయాలు కాగా, సుకన్య స్వల్పంగా గాయపడింది. స్థానికుల సమాచారం మేరకు 108సిబ్బంది అక్కడకు చేరుకొని గాయపడిన వారిని శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి విచారించనున్నట్లు తెలిపారు.

గజ వాహనంపై పరమశివుడి కటాక్షం



గజ వాహనంపై శివుడికి హారతులిస్తున్న అర్చకుడు

నాగలాపురం, మార్చి 6: మండలంలోని సురుటుపల్లె పళ్లికొండేశ్వరాలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం వాల్మీకేశ్వరుడు గజ వాహనంపై పురవీధుల్లో విహరించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుక్కల్ ఆలయంలోని పరివార దేవతలకు అభిషేకాలు, యాగశాల మండపంలో యాగశాల పూజలు నిర్వహించారు. సాయంత్రం వాల్మీకేశ్వర స్వామి, మరగదాంబికా అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం పుష్పాలతో, బంగారు ఆభరణాలతో అలంకరించి మహా హారతి చేపట్టి స్వామి, అమ్మవార్లను గజ వాహనంపై అధిష్టింప జేసి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. ఈ పూజలకు కారణి గ్రామానికి చెందిన డిల్లీబాబు, జేబీ మునిరత్నం కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ చైర్మన్ ఏ.వి.ఎం బాలాజీరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షించారు.

టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడిగా బాలరాజు



నాగలాపురం, మార్చి 6: టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడిగా సత్యవేడు మండలం పీవీ పురం గ్రామానికి చెందిన కొండూరు బాలరాజ్ బుధవారం నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు నుంచి నియామక పత్రం అందినట్లు ఆయన తెలిపారు. తనను నియమించడం పట్ల టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్‌కు ఈ సందర్భంగా బాలరాజు కృతజ్ఞలు తెలిపారు. సత్యవేడు నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ హెలెన్ సూచనల మేరకు పార్టీ బలోపేతానికి తమ వంతు కష్టపడి పనిచేస్తానని తెలిపారు.

దివ్యాంగుల మహాగర్జనను జయప్రదం చేయండి

వరదయ్యపాళెం, మార్చి 6: దివ్యాంగుల మహాగర్జనను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు రాగిపట్టు రాఘవయ్య మాదిగ, నీరుపాకు దొరబాబు కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం మండలకేంద్రంలో పర్యటించి దివ్యాంగులకు కరపత్రాలను పంపిణీ చేశారు.

శ్రీసిటీలో మిజోరం గవర్నర్



శ్రీసిటీ గురించి హరిబాబుకు వివరిస్తున్న శ్రీసిటీ ఎండీ

శ్రీసిటీ, మార్చి 6: మిజోరాం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు బుధవారం శ్రీసిటీని సందర్శించారు. గవర్నర్‌కు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదరస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శ్రీసిటీలోని పరిశ్రమల సీఈవోల సమావేశంలో గవర్నర్ మాట్లాడుతూ శ్రీసిటీ అద్భుతమైన మౌలికసదుపాయాలు, వ్యాపార అనుకూల వాతావరణాన్ని కొనియాడారు. గతంలో వెనుకబడ్డ ఈ ప్రాంతాన్ని ఆర్థికంగా అభివృద్ధి చెందిన ప్రాంతంగా తీర్చిదిద్దడంలో శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కృషి, అంకితభావం ఎంతో ఉందని అభినందించారు. మిజోరాం ప్రభుత్వ అధికారుల బృందంతో కలసి డైకిన్ పరిశ్రమలోని నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ఆయన సందర్శించి అక్కడ నిపుణులతో చర్చించారు. మిజోరాం యువతకు ఉపాధి అవకాశాలను పెంపొందించే లక్ష్యంతో కొన్ని రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలతో ఆయన చర్చలు జరిపారు. పర్యటనలో భాగంగా శ్రీసిటీలోని ట్రిపుల్ ఐటీ కళాశాలను సందర్శించి అక్కడ విద్యార్థులు అధ్యాపకులతో చర్చలు జరిపారు. శ్రీసిటీలో మొట్ట మొదటి గవర్నర్ పర్యటన ఇదేనని ఎండీ పేర్కొన్నారు. అలాగే హరిబాబుతో తనకున్న అనుబంధాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు.

సచివాలయం ప్రారంభం

సత్యవేడు మండలం ఇరుగుళంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, ఆర్‌బీకే కేంద్రాలను బుధవారం ఎంపీ గురుమూర్తి ప్రారంభించారు. కార్యక్రమంలో వైసీపీ సమన్వయకర్త రాజేష్, ఎంపీపీ ప్రతిమ, జడ్పీటీసీ విజయలక్ష్మి, సర్పంచ్ శేఖర్, ఎంపీటీసీ సెల్వి, కో-ఆప్షన్ మెంబరు మస్తాని, ఎంపీడీవో చంద్రశేఖర్, తహసీల్దార్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.5లక్షల విరాళం



ముక్కంటి ఆలయంలో ఎంపీ మేడా రఘునాథరెడ్డి

శ్రీకాళహస్తి, మార్చి 6: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే నిత్యాన్నదానం పథకానికి రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి రూ.5,00,116 విరాళంగా సమర్పించారు. ముక్కంటి ఆలయాన్ని బుధవారం ఆయన దర్శించుకున్నారు. ముందుగా పీఆర్వో కార్యాలయంలో అన్నదాన పథకానికి విరాళం అందజేశారు. ఆలయ అధికారులు ఆయనకు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

శ్రీకాళహస్తికే తిరిగి రమేష్ బాబు



శ్రీకాళహస్తి, మార్చి 6: శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్‌గా రమేష్ బాబును తిరిగి నియమించారు. కమిషనర్‌గా పనిచేస్తున్న రమేష్ బాబును ఇటీవల బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అది రద్దు చేస్తూ యథా స్థానంలో కమిషనర్‌గా రమేష్ బాబును కొనసాగిస్తూ అధికారులు బుధవారం ఆదేశాలను జారీ చేశారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలి

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 6: విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలని తహసీల్దార్ ఆలీఖాన్ నిర్వాహకులకు సూచించారు. మండలంలోని వెస్ట్‌వరత్తూరు పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనాన్ని తహసీల్దార్, ఎంఈవో రవీంద్రనాథ్, డిప్యూటి తహసీల్దార్ చంద్రబాబు తనిఖీ చేశారు.



మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీకాళహస్తి ఆలయంలో యాగశాలలో హోరతులు సమర్పిస్తున్న దీక్షాగురుకుల్




తిరువీధిలో హంస-యాళి వాహన సేవ

ఆకర్షణీయంగా కైలాసం సెట్టింగ్ .. నేడు ప్రారంభం



శ్రీకాళహస్తి, మార్చి 6: శ్రీకాళహస్తీశ్వరాలయం రెండో గేటు సమీపంలో రూపొందిస్తున్న కైలాసం సెట్టింగ్ భక్తులకు ఆకర్షణీయంగా కనిపిస్తోంది. ప్రతి సంవత్సరం ఇదే ప్రదేశంలో కైలాసం సెట్టింగ్ ఏర్పాటు చేయడం ఆనవాయితీ. ఏడాది గతంలో కన్నా భిన్నంగా ఆకర్షణీయంగా ప్రవేశ ద్వారాన్ని డిజైన్ చేశారు. గురువారం మధ్యాహ్నం కైలాసం సెట్టింగ్‌ను ప్రారంభించనున్నారు.





బ్రహ్మోత్సవాల్లో నేడు

- నాలుగో తిరునాళ్లు, నాగరాత్రి (మాఘ బహుళ ద్వాదశి)

ఉభయదారులు....

- ఉదయం: ముద్దు కృష్ణారెడ్డి 43 ఎకరాల భూదాత, చుక్కల నిడిగల్లు గ్రామం
- రాత్రి: పేట జనార్ధనరావు, అడ్వకేట్, శ్రీకాళహస్తి

వాహన సేవలు

- ఉదయం 9గంటలకు హంస,శుక వాహనాలు
- రాత్రి 8గంటలకు శేష, యాలి వాహనసేవ

నిత్యోత్సవాల వివరాలు

- ఉదయం 4.30గంటలకు: మంగళవాయిద్యాలు
- ఉదయం 5గంటలకు: గోపూజ, సర్వదర్శనం
- ఉదయం 6గంటలకు: ప్రథమ కాల అభిషేకం
- ఉదయం 7గంటలకు: ద్వితీయ కాల అభిషేకం
- ఉదయం 8గంటల: పరివారదేవాలయాల నైవేద్యం
- ఉదయం 9గంటలకు: స్వామి అమ్మవార్ల పురవీధి ఉత్సవం
- ఉదయం 10.30గంటలకు: ఉచ్చికాల అభిషేకం
- సాయంత్రం 5గంటలకు: ప్రదోష కాల అభిషేకం
- రాత్రి 8గంటలకు: స్వామి అమ్మవార్ల పురవీధి ఉత్సవం
- రాత్రి 9 గంటలకు: దర్శనం ముగింపు
- ఉదయం 6 నుంచి సాయంత్రం 6గంటల వరకు రాహుకేతు సర్పదోష నివారణ పూజలు

ట్రాఫిక్ ఆంక్షలు కట్టుదిట్టం

శ్రీకాళహస్తి, మార్చి 6: ఈ నెల 8 శుక్రవారం శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ నరసింహ యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనల్లో భాగంగా తిరుపతి, నెల్లూరు నుంచి ఆలయానికి వచ్చే భక్తుల కార్లను, బస్సులను పొన్నాలమ్మ ఆలయం వద్ద ఉన్న మార్కెట్ కమిటీలో పార్కింగ్ చేసుకోవాలన్నారు. ద్విచక్రవాహనాలను రివర్‌వ్యూ హోటల్ (స్వర్ణముఖి నది కట్ట) మీద పార్కింగ్ కేటాయించామని తెలిపారు. అలాగే చెన్నై వైపు నుంచి వచ్చే వాహనాలు సైతం టూటౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి బైపాస్ మీదుగా వచ్చి మార్కెట్ కమిటీలోనే ఏర్పాటు చేసుకోవాలన్నారు. పార్కింగ్ ప్రదేశాల నుంచి భక్తులను ఆలయానికి తరలించేందుకు ప్రతి పది నిముషాలకు ఒక బస్సును ఉచితంగా నడుపుతున్నారని చెప్పారు. అలాగే బస్టాండ్, వీఎంసీ సర్కిల్ నుంచి కూడా బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. ఊరేగింపుల సమయంలో మాడవీధుల్లోకి ఎలాంటి వాహనాలు అనుమతించేది లేదన్నారు. ముఖ్యంగా స్థానికులు పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా కోరారు. స్వర్ణముఖి నదికి అవతల వైపున ఆటోలను పొన్నాలమ్మ ఆలయం, వెంకటగిరి బస్టాండ్ వరకే అనుమతిస్తామన్నారు.

నేడు సారె సమర్పణ

జ్ఞాన ప్రసూనాంబికా సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామికి గురువారం రాష్ట్ర ప్రభుత్వం తరపున సారెను సమర్పించనున్నారు. ముక్కంటి ఆలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలను అందజేయనున్నారు

టీ షర్టులు అందజేత



టీ షర్టు అందజేస్తున్న ఈవో

శ్రీకాళహస్తి, మార్చి 6: యువతరం సేవా సమితి స్వచ్ఛంద సంస్థ సభ్యులకు ముక్కంటి ఆలయ ఈవో నాగేశ్వరరావు బుధవారం టీ షర్ట్‌లు అందజేశారు. పట్టణానికి చెందిన యువతరం సేవా సమితి సభ్యులు సుమారు 200 మంది మహాశివరాత్రి ఉత్సవాల్లో స్వచ్ఛంద సేవలు అందిస్తుంటారు. తిరుపతికి చెందిన శుభమస్తు షాపింగ్ మాల్ నిర్వాహకులు ముక్కంటి ఆలయానికి టీ షర్టులను సమర్పించారు. ఈ మేరకు ఆలయ పరిపాలనాభవనంలో ఈవో సభ్యులకు టీ షర్టులు అందజేశారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి

శ్రీకాళహస్తి, మార్చి 6: సుమారు 200 మంది వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఇందిరా నగర్‌లో బుధవారం వలస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విచ్చేసిన బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. తన తండ్రి బాటలోనే ప్రజా అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం ఇందిరానగర్‌కు చెందిన యువత, ముస్లిం, క్రిస్టియన్ కుటుంబాలకు చెందిన సుమారు 200 మంది టీడీపీలో చేరారు. వారిని బొజ్జల సుధీర్ రెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ పటణాధ్యక్షుడు విజయ్ కుమార్, మాజీ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ చెంచయ్య నాయుడు, నాయకులు కాసరం రమేష్, వజ్రం కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



యువతను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న సుధీర్ రెడ్డి

బీసీల అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

ఏర్పేడు, మార్చి 6: బీసీల అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని ఆ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. ఏర్పేడు మండలం నచ్చనేరి పంచాయతీలోని దుర్గిపేరిలో ఇంటింటకి మీ బొజ్జల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ న ఆయకులు సుబ్రహ్మణ్యంరెడ్డి, గోపాల్‌రెడ్డి, మునెయ్య, హరినాథ్, మునిరత్నం, కైలాసం రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని గెలిపించడానికి సిద్ధం

తొట్టంబేడు, మార్చి 6: టీడీపీని, బొజ్జల కుటుంబాన్ని గెలిపించడానికి తొట్టంబేడు మండల ప్రజలు సిద్ధంగా ఉన్నారని బొజ్జల రిషితారెడ్డి అన్నారు. మండలంలోని తొట్టంబేడు పంచాయతీ బీడీకాలనీ, సీఆర్‌ఎన్ కండ్రిగ గ్రామాల్లో ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గాలి చలపతినాయుడు, మురళినాయుడు, మునిరాజనాయుడు, మాజీ జడ్పీటీసీ వెంకటాచలం, జడ్పీటీసీ అర్చనాదేవి, నాయకులు మునిరత్నం, కన్నలిప్రతాప్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, బాస్కర్‌నాయుడు తదితరులుపాల్గొన్నారు.



సామూహిక శివదీక్ష

శ్రీకాళహస్తి మార్చి 6: శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి, వైసీపీ నాయకులు సామూహికంగా శివదీక్షను స్వీకరించారు. ముక్కంటి ఆలయంలో బుధవారం శివ దీక్ష పట్టారు. కార్యక్రమంలో మాజీ ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శివదీక్ష స్వీకరించిన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి

బాల్య వివాహాలను ప్రోత్సహించడం నేరం: డీఎస్పీ

శ్రీకాళహస్తి, మార్చి 6: బాల్య వివాహాలను ప్రోత్సహించడం నేరమని శ్రీకాళహస్తి డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి అన్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు బుధవారం బాల్యవివాహాల నిర్మూలనపై పట్టణంలో అవగాహనా ర్యాలీ చేశారు. పట్టణంలోని రాజగోపురం వద్ద డీఎస్పీ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. అంతకు ముందు డీఎస్పీ ఉమామహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ... తగిన వయసు రాకుండా వివాహం చేయడంతో తీవ్ర అనర్థాలు వస్తాయని, వాటిని ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిషనర్లు ఎం.ఎం. రెడ్డి, రమేష్ బాబు, యూత్ చైర్మన్ షేక్ అజారుద్దీన్, సహాయ కమిషనర్ పార్వతి, గైడ్ కెప్టెన్ పద్మావతి, నిర్మల, సరిత, స్కౌట్ మాస్టర్లు సుబ్రహ్మణ్యం, యోగానందం, ధనుష్ లీడర్లు మహేంద్ర, విద్యాసాగర్, చందు, అభిరామ్, యోగేష్, జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, బాబుఅగ్రహారం, సరస్వతి బాయ్, బాస్కర పేట పురపాలక ఉన్నత పాఠశాలల, ఎపి గిరిజన సంక్షేమ పాఠశాల, ఆర్సీపీ స్కూల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల రోవర్లు, రేంజర్లు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: మహాశివరాత్రి పురస్కరించుకుని ఎవరైనా బాల్య వివాహాలు చేయాలని ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని పిచ్చాటూరు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. శివరాత్రి పురస్కరించుకుని రామగిరి, కీళపూడి శివాలయాల్లో బాల్య వివాహాలు చేయాలని ప్రయత్నిస్తే తల్లిదండ్రులు, బంధువులపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్న సమాచారం తెలిస్తే వెంటనే తన మొబైల్ నెంబరు 9440900727కు ఫిర్యాదు చేయాలని ఎస్‌ఐ తెలిపారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎస్పీ ఉమా మహేశ్వర రెడ్డి

ఏర్పేడు: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రగతి స్వచ్ఛంధ సంస్థ పాపానాయుడుపేట క్లస్టర్ ఇన్‌ఛార్జి సుభాష్ అన్నారు. ఏర్పేడుమండలం మునగలపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు బాల్యవివాహాల వలన కలిగే అనర్థాలను వివరించారు.

తొట్టంబేడు: శ్రీకాళహస్తి మండలంలోని బీవీపురం, ఓబులాయపల్లి గ్రామంలో ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో బాల్యవివాహాలపై అవగాహణ ర్యాలీ బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో బీవీపురం ప్రాథమికోన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు షాదిక్‌బాష, ప్రగతి సిబ్బంది ప్రభాకర్, రామచంద్ర, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్ వాడి సిబ్బంది పాల్గొన్నారు.